RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త


తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 300 మేడ్చల్ మల్కాజ్‌గిరి 21 నవంబర్ 2024 గురువారం పేజీలు : 4

## కొవిడ్ అక్రమాలపై విచారణ..

బెంగళూరు: బీజేపీ పాలనలో కొవిడ్ అక్రమాలపై సిట్ తోపాటు మంత్రివర్గ సబ్ కమిటీ ఏర్పాటు చేయాలన కేబినెట్‌లో ఏకగ్రీవంగా తీర్మానించారు. సీఎం సిద్దరామయ్య అధ్యక్షతన మంత్రివర్గ భేటీ జరిగింది. కేబినెట్‌లో తీర్మానాలను రాష్ట్ర శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ మీడియాకు వెల్లడించారు. 16 అంశాలపై కేబినెట్‌లో చర్చించినట్లు ఆయన తెలిపారు. కొవిడ్ పరిధిలో అవినీతికి సంబంధించి దర్యాప్తునకు కేబినెట్ సబ్‌కమిటీతోపాటు స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కొవిడ్‌వేళ వస్తువుల కొనుగోళ్లకు సంబంధించి నియమించబడిన న్యాయమూర్తి మైఖేల్ డి కున్హా కమిషన్ 2024 ఆగస్టు 31న సమర్పించిన నివేదికపై కేబినెట్‌లో సుదీర్ఘంగా చర్చించామన్నారు. కమిషన్ 11 సంపుటలతో నివేదిక ఇచ్చిందన్నారు. 7,223.64 కోట్ల రూపాయల అవినీతి జరిగిందని తేల్చిందన్నారు.




# సాగునీటి ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం

## మిడ్‌మానేరు నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నాం

## రాజన్న సిరిసిల్లపై వరాల జల్లు కురిపించిన సీఎం రేవంత్‌రెడ్డి

వేములవాడ: ప్రజలనే కాదు.. వేములవాడ రాజన్ననూ కేసీఆర్ మోసం చేశారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కేసీఆర్‌ను గద్దె దించాలని సిరిసిల్ల పాదయాత్రలో నిర్ణయించుకున్నానని తెలిపారు. ప్రజా సంకల్పయాత్రలో భాగంగా వేములవాడ గుడిచెరువులో ఏర్పాటు చేసిన బహిరంగసభలో సీఎం మాట్లాడారు. మిడ్‌మానేరు నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఈ ప్రాంతంలో వాయిదా పడుతూ వస్తున్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. ఈ నెల 30న మరోసారి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇక్కడికి వచ్చి ప్రాజెక్టులపై సమీక్షిస్తారని సీఎం చెప్పారు. “దేశానికి ప్రధానిని అందించిన గడ్డ క రీంనగర్. పరిపాలన ఎలా ఉంటుందో దేశానికి చూపిన తెలంగాణ బిడ్డ పీవీ నరసింహారావు. తెలంగాణ ఇస్తామని సోనియాగాంధీ ఇక్కడి నుంచే ప్రకటన చేశారు. తెలంగాణ బిల్లును ఆమోదింపజేయడంలో కరీంనగర్ బిడ్డ, జైపాల్‌రెడ్డి కీలక పాత్ర పోషించారు. కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే ఎంత దూరమైనా వెళ్తుంది. పొన్నం ప్రభాకర్‌ను ఎంపీగా గెలిపిస్తే తెలంగాణ రాష్ట్రం సాధించారు. బండి సంజయ్‌ను రెండు సార్లు పార్లమెంట్‌కు పంపిస్తే కేంద్ర మంత్రి అయ్యారు కానీ, కరీంనగర్ జిల్లాకు కేంద్రం నుంచి చిల్లి గవ్వ అయినా తెచ్చారా? కరీంనగర్ అభివృద్ధి కోసం ఎప్పుడైనా పార్లమెంట్‌లో మాట్లాడారా?అంతకు ముందు 3 సార్లు భారాస ఎంపీలను గెలిపిస్తే వాళ్లు కూడా కరీంనగర్‌కు చేసిందేమీ లేదు.

**50వేల ఉద్యోగాలకు ఒక్కటి తగ్గినా క్షమాపణ చెబుతా..** స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలోని ఏ రాష్ట్రం కూడా అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే 50వేల ఉద్యోగాలు ఇవ్వలేదు. 50వేల ఉద్యోగాలకు ఒక్కటి తగ్గినా ఎల్బీ స్టేడియం వేదికగా క్షమాపణ చెబుతా. రూ.11వేల కోట్ల రుణమాఫీకి కేసీఆర్ ఐదేళ్లు తీసుకున్నారు. 25 రోజుల్లో 23 లక్షల కుటుంబాలకు రూ.18వేల కోట్ల రుణమాఫీ చేశాం. రుణమాఫీని అభినందించాల్సింది పోయి విమర్శిస్తారా? మీరు చేసిన రుణమాఫీ.. మేము చేసిన రుణమాఫీ వివరాలు బయటకు తీసి చర్చకు పెడదాం. కేసీఆర్ అసెంబ్లీకి వస్తే రుణమాఫీ లెక్కలు తీసి చూపిస్తాం. పదేళ్లలో మీరు చేయలేని పని మేం చేస్తుంటే మీకు నొప్పి ఎందుకు? మీ నొప్పికి మా కార్యకర్తల దగ్గర మందు ఉంది.. త్వరలోనే పెడతారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మీ సంగతి తేలుస్తాం.

**భూ బదలాయింపులపై హరీశ్‌రావు లెక్క చెప్పాలి...** మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తే భారాస నేతలు తట్టుకోలేకపోతున్నారు. ఈ ఏడాది తెలంగాణలో కోటి 53 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు పండించారు.. అది మా గొప్పతనం కాదా? రూ.1.83 లక్షల కోట్లు ప్రజాధనాన్ని ప్రాజెక్టుల కోసం కేసీఆర్ ఖర్చు పెట్టారు. రంగనాయకసాగర్ వద్ద హరీశ్‌రావు ఫామ్‌హౌస్ కట్టుకున్నారు. భూ సేకరణ కోసం తీసుకున్న భూమిని హరీశ్‌రావు పేరు మీదకు రాయించుకున్నారు. భూ బదలాయింపులపై హరీశ్‌రావు లెక్క చెప్పాలి.. అన్ని లెక్కలు తీయిస్తున్నాం. కొండపోచమ్మ నుంచి కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు కాల్వ ద్వారా నేరుగా నీళ్లు వెళ్తున్నాయి. ప్రజలు అధికారం ఇస్తే ఇదేనా మీరు చేసింది? డ్రగ్స్ తీసుకున్న వారు ఇంట్లో దొరికితే కేసు పెట్టకూడదా? బావ తాగి తందనాలు ఆడితే.. కేటీఆర్ ఎలా సమర్థిస్తారు? విదేశీ మద్యంతో దొరికితే కేసు పెట్టకూడదా? చట్టం అందరికీ సమానమే కేటీఆర్. కేటీఆర్ ఉరుకులాటలు గమనిస్తూనే ఉన్నా.. ఎంత దూరం ఉరుకుతారో నేనూ చూస్తా. భూ సేకరణపై కుట్ర చేసినందుకు కేటీఆర్ ఊచలు లెక్కపెడతారు. నా నియోజకవర్గంపై కేసీఆర్‌కు ఎందుకంత కక్ష? నేనేమీ లక్ష ఎకరాలు సేకరించలేదు. సేకరిస్తానన్నది 4 గ్రామాల్లో 1100 ఎకరాలు.

**కేసీఆర్.. ఒక్కసారి అసెంబ్లీకి రా.. సామి..** పరిశ్రమలు వస్తే మా పిల్లలకు ఉద్యోగాలు వస్తాయని భూ సేకరణ చేస్తున్నాం.

భూసేకరణకు అధికారులు వస్తే దాడి చేస్తారా? భూ సేకరణ చేయడం కేసీఆర్‌కు ఇష్టం లేదా? పరిశ్రమలు తెచ్చి మన పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వకూడదా? భారాస అధికారంలో ఉన్నప్పుడు భూములు సేకరించలేదా? అభివృద్ధి జరగాలంటే భూ సేకరణ జరగాల్సిందే. అభివృద్ధి కోసం ఎవరో ఒకరు భూమి కోల్పోవాల్సిందే. భూమి కోల్పోతున్న వారికి మూడు రెట్లు పరిహారం ఇవ్వాలని నిర్ణయించాం. చివరిగా చంద్రశేఖర్‌రావుకి ఒకటే చెబుతున్నా..

అసెంబ్లీకి రా.. సామి. 80వేల పుస్తకాలు ఏం చదివినవో మాట్లాడుదాం. ఒక్కసారి రా.. సామి.. వస్తే రోజంతా చర్చ చేద్దాం. అన్ని లెక్కలు తేలుద్దాం” అని సీఎం అన్నారు.




## మహారాష్ట్రలో హోరాహోరీ..
## ఝార్ఖండ్‌లో ఎన్డీయే..
## ఎగ్జిట్‌పోల్స్ అంచనాలివే..!

మహారాష్ట్ర, ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగియడంతో ఎగ్జిట్ పోల్స్ విడుదలయ్యాయి. మహారాష్ట్రలో అధికార మహాయుతి, విపక్ష మహా వికాస్ అఘాడీ కూటమిల మధ్య హొరాహొరీగా పోటీ ఉండనున్నట్లు పలు సర్వేలు అంచనా వేశాయి.

మహారాష్ట్ర ఓటర్లు భాజపా-శివసేన-ఎన్సీపీ సారథ్యంలోని ‘మహాయుతి’కి పీపుల్స్ పల్స్, చాణక్య, మ్యాట్రిజ్, న్యూస్18 సంస్థల సర్వేలు స్పష్టమైన మెజార్టీ వస్తుందని పేర్కొనగా.. లోక్‌శాహీ మరాఠీ, దైనిక్ భాస్కర్ సంస్థలు మాత్రం విపక్ష కూటమి వైపు మొగ్గు ఉన్నట్లు అంచనా వేశాయి. అటు ఝార?ండ్‌లో కాషాయ పార్టీ వైపే ఓటర్లు మొగ్గుచూపినట్లు పలు సంస్థల సర్వేలు పేర్కొన్నాయి.

**మహారాష్ట్ర**.. పీపుల్స్ పల్స్: మహాయుతి-182, ఎంవీఏ-97, ఇతరులకు 9 స్థానాలు. చాణక్య: మహాయుతి 152-160, ఎంవీఏ-130-138, ఇతరులు 6-8. మ్యాట్రిజ్: మహాయుతి- 150-170, ఎంవీఏ- 110-130, ఇతరులు 8-10. సీఎన్ఎన్-న్యూస్18: మహాయుతి-154, ఎంవీఏ-128, ఇతరులు 6. లోక్‌శాహీ మరాఠీ: మహాయుతి- 128-142, ఎంవీఏ- 125-140, ఇతరులు 18-23. దైనిక్ భాస్కర్: మహాయుతి 125-140, ఎంవీఏ-135-150, ఇతరులు 20-25. పీ-మార్క్: మహాయుతి- 137-157, ఎంవీఏ- 126-146, ఇతరులు 2-8.

**ఝార్ఖండ్....** పీపుల్స్ పల్స్: ఎన్డీయే 46-58, ఇండియా కూటమి 24-37, ఇతరులు 6-10. మ్యాట్రిజ్: ఎన్డీయే 42-47, ఇండియా కూటమి 25-30, ఇతరులు 1-4. టైమ్స్ నౌ-జేవీసీ: ఎన్డీయే 40-44, ఇండియా కూటమి 20-40, ఇతరులు 1-1. యాక్సిస్ మై ఇండియా: ఎన్డీయే 25, ఇండియా కూటమి 53, ఇతరులు 3. దైనిక్ భాస్కర్: ఎన్డీయే 37-40, ఇండియా కూటమి 36-39, ఇతరులు 0-2. మహారాష్ట్రలో మొత్తం 288 అసెంబ్లీ స్థానాలుండగా.. మెజార్టీ మార్కు 145. అధికారంలో ఉన్న మహాయుతిలోని భాజపా 149, శివసేన 81, ఎన్సీపీ 59 స్థానాల్లో పోటీ చేశాయి. విపక్ష ఎంవీఏలోని కాంగ్రెస్ 101, శివసేన 95, ఎన్సీపీ 86 సీట్లలో పోటీ చేయగా.. బీఎస్పీ 237 చోట్ల, ఎంఐఎం 17 స్థానాల్లో పోటీ చేశాయి.

ఝార్ఖండ్‌లో మొత్తం 81 స్థానాలుండగా మెజార్టీ మార్కు 41. భాజపా 68, ఏజేఎస్‌యూ 10, జేడీయూ రెండు, లోక్‌జన్‌శక్తి(రామ్‌విలాస్) పార్టీ ఒకచోట పోటీ చేశాయి. విపక్ష కూటమి తరఫున జేఎంఎం 43, కాంగ్రెస్ 30, ఆర్జేడీ 6, సీపీఐ(ఎంఎల్) నాలుగు చోట్ల పోటీ చేశాయి.




మాగనూరు: నారాయణపేట్ జిల్లా మాగనూరు జిల్లా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజనం వికటించి 25 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తుండగా విద్యార్థులు ఒక్కసారిగా వాంతులు చేసుకొని అస్వస్థతకు గురయ్యారు. ఇది గమనించిన పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు విద్యార్థులను స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లారు. వారిలో కొంత మందికి ప్రాథమిక చికిత్స అందించి వారి ఇళ్లకు పంపించారు. 9 మంది విద్యార్థులను మెరుగైన చికిత్స కోసం మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరిలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. మరికొంత మందికి పాఠశాల వద్దే వైద్యుడి సమక్షంలో చికిత్స అందిస్తున్నారు. విషయం తెలిసిన తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన జరిగిన తీరుపై పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

# సీఎం రేవంత్‌లో విషయం తక్కువ..

# విషం ఎక్కువ



హైదరాబాద్, నవంబర్ 20: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్‌కు వచ్చేది అయితే ఒట్లు.. లేదంటే తిట్లు మాత్రమేనని ఎద్దేవా చేశారు. బుధవారం నాడు మహబూబ్‌నగర్ జిల్లా సీసీకుంట మండలం కురుమూర్తి స్వామి ఆలయానికి వచ్చారు హరీష్ రావు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం ఆలయం బయట మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని.. పాలకుడు ప్రజలను మోసం చేయకుండా ఉండాలని కురుమూర్తి స్వామిని వేడుకున్నట్లు హరీష్ రావు చెప్పారు. కురుమూర్తి స్వామి మీద ఒట్టు పెట్టి.. ఋణ మాఫీ చేస్తామన్న సీఎం రేవంత్.. ఇప్పుడు ఆ మాట తప్పాడని ఎద్దేవా చేశారు. ఆలయానికి వస్తున్న దారిలో ఎంతో మంది రైతులను అడిగామని.. ఏ ఒక్కరూ సంతోషంగా లేరని చెప్పుకొచ్చారు. పాలకుడు మాట తప్పితే.. ఆ ప్రాంతానికి నష్టం జరుగుతదన్నారు హరీష్ రావు. ‘మొన్న ఇక్కడికి వచ్చి స్వామి వారిని క్షమించమని అడుగుతారేమో అనుకున్న.. కానీ సీఎం రేవంత్ మరోసారి మోసం చేశాడు. అందుకే.. సీఎం రేవంత్‌ను క్షమించు.. ప్రజలను కాపాడమని స్వామి వారిని కోరుకున్నాను.’ అని హరీష్ రావు చెప్పుకొచ్చారు. వరంగల్‌లో ఏదైనా హామీలు నెరవేర్చే అంశంపై మాట్లాడుతారు అనుకున్నానని చెప్పారు. సీఎం రేవంత్‌కు అయితే ఒట్లు వేయడం.. లేదంటే తిట్లు మాత్రమే వచ్చునని విమర్శించారు. వరంగల్ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలు ఒక్కటీ అమలు కాలేదని దుయ్యబట్టారు. ప్రజలను దగా చేయడం.. ప్రతిపక్షాలపై పగపట్టడం తప్ప ఆయన చేసిందేమీ లేదన్నారు. తెలంగాణ ఏమీ కొల్పోలేదని రేవంత్ చెబుతున్నారని.. ప్రజలు రైతుబంధు, బతుకమ్మ చీరలు, కేసీఆర్ కిట్, చేపలు, గొర్రెలు సహా అనేక పథకాలను కోల్పోయారని హరీష్ రావు గుర్తు చేశారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక.. బి ట్యాక్స్ వచ్చిందని హరీష్ రావు విమర్శించారు. హైదరాబాద్‌లో ఇల్లు కట్టాలంటే ఆర్ ట్యాక్స్, యూ ట్యాక్స్, బి ట్యాక్స్ కట్టాల్సి వస్తోందంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను రేవంత్ దూషించడంపై హరీష్ రావు తీవ్రంగా స్పందించారు. సీఎం స్థానంలో ఉండి అలాంటి భాష మాట్లాడటం ఏంటి? అని ప్రశ్నించారు. ఆరు గ్యారంటీలు అమలు చేసేదాకా రేవంత్ రెడ్డిని వదిలే ప్రసక్తే లేదని హరీష్ రావు హెచ్చరించారు. కేసీఆర్‌ను రైతు ముఖ్యమంత్రిగా.. రేవంత్‌ను బూతుల ముఖ్యమంత్రిగా ప్రజలు పిలుచుకుంటున్నారని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ ఎగబెట్టారు కాబట్టే ఎనుముల రేవంత్ రెడ్డిని.. ఎగవేతల రేవంత్ రెడ్డి అని పిలుస్తున్నామన్నారు హరీష్ రావు. గట్టిగా పని చేస్తే నాలుగు నెలల్లో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తవుతుందని చెప్పారాయన. ఈసారి చాలా నీళ్ల సముద్రంలో కలిశాయని గుర్తు చేశారు. పాలమూరును దగా చేసింది కాంగ్రెస్, టీడీపీలే అని హరీష్ రావు విమర్శించారు. వీరివల్లే వలసల జిల్లాగా మహబూబ్‌నగర్ మారిందన్నారు. తాము అధికారంలోకి వచ్చాక వలసలను వాపస్ తెచ్చామని హరీష్ రావు చెప్పారు. గతంలో కేవలం 30 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు మాత్రమే పండేవని.. కేసీఆర్ ప్రభుత్వం చివరి నాటికి కోటి యాభై తొమ్మిది లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు పండాయని హరీష్ రావు వివరించారు. కేసీఆర్ పాలనలో వ్యవసాయాన్ని పండుగ చేశారు కనుకే అది సాధ్యమైందన్నారు. సీఎం రేవంత్ నిద్రలో కూడా కేసీఆర్‌ను కలవరిస్తున్నాడంటూ హరీష్ రావు ఎద్దేవా చేశారు.

ఎనిమిది నెలలుగా మహిళా రుణాలు ఆగిపోయాయని చెప్పారు. ఇక్కడ ఇచ్చిందేమీ లేదుగానీ.. మహారాష్ట్రలో రుణాలు ఇస్తామని చెప్తున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డి మాటలపై హరీష్ రావు విమర్శలు గుప్పించారు. వరంగల్‌లో జరిగిన కాంగ్రెస్ మీటింగ్‌లో తిట్ల పురాణం తప్ప.. ఇచ్చింది ఏమీ లేదన్నారు. కేసీఆర్ కలుపు మొక్క అని రేవంత్ అనడంపై స్పందించిన హరీష్ రావు.. కేసీఆర్ తెలంగాణకు కల్ప వృక్షం అని పేర్కొన్నారు. సీఎం రేవంత్ మాటల్లో శబ్ధం ఎక్కువ.. విషయం తక్కువ.. విషం ఎక్కువ అంటూ తనదైన శైలిలో హరీష్ రావు సెటైర్లు వేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వడ్లు కొనడం కూడా చేతకావడం లేదని విమర్శించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి 90 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు కొంటామని చెబితే.. సివిల్ సప్లై కమిషనర్ 70 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు కొంటామని చెప్పారని.. కానీ, ఇప్పటికీ 20 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు మాత్రమే కొనుగోలు చేశారని హరీష్ రావు విమర్శించారు. ప్రభుత్వ చర్యల కారణంగా రైతులు తాము పండించిన పంటను దళారులకు అమ్ముకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా.. 100 సీట్లతో బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుందని, ప్రజలు ఎన్నికల కోసం ఎదురు చూస్తున్నారని హరీష్ రావు పేర్కొన్నారు.

# సంపాదకీయం

## పవన్ హిందూత్వం... కమలానికి అస్తిత్వం!

జనసేన శివసేన ఒక్కటే అని మహారాష్ట్ర ఎన్నికల ప్రచారం సందర్భంగా ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. దేశంలో 1960 దశకంలో పుట్టిన శివసేన మరాఠాల హక్కుల సాధన కోసం మొదట్లో చాలా గట్టిగానే పోరాడింది. ఆ మీదట హిందూత్వ భావజాలాన్ని తన సిద్ధాంతంగా మార్చుకుంది. అలా స్థానిక ఎన్నికల నుంచి ఎదుగుతూ వస్తూ 1990 దశకంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించింది. బీజేపీది అదే సిద్ధాంతం కావడంతో రెండు పార్టీలు కలిసి మహా రాజకీయాలు చేశాయి. జనసేన విషయానికి వస్తే పవన్ పార్టీ పెట్టిన నాటికి హిందూత్వ లేదు, పైగా ఆయన మాటలలో కమ్యూనిజం భావజాలం కనిపించింది. చెగువేరా కూడా గట్టిగా వినిపించేవారు. ఇక 2019 ఎన్నికల వేళ కామ్రేడ్స్ తో పొత్తు మాయావతిని దేశ ప్రధానిగా చూడాలని పవన్ కోరుతున్న తీరు అన్నీ కూడా జనాలకు గుర్తు ఉన్నాయి. ఇవన్నీ పక్కన పెడితే 2024 ఎన్నికల తరువాత పవన్ సనాతన ధర్మం అంటున్నారు. హిందూత్వ జెండాను ఎత్తుకున్నారు. మహారాష్ట్రలో ఆయన బీజేపీకి చేసి పెట్టిన ప్రచారం చూస్తే ఆయన భావజాలం ఫక్తు బీజేపీదే అని అంటున్న వారూ ఉన్నారు. పవన్ ప్రవచించే సనాతనధర్మం బీజేపీ ఐడియాలజీలోనూ ఉంది. ఇంతలా పవన్ మాట్లాడుతున్న తీరుని చూసిన వారు ఆయన బీజేపీకి ప్రియమైన మిత్రుడుగా మారిపోయారు అని అంటున్నారు. ఏపీలో కూటమి ప్రభుత్వంలో జనసేన టీడీపీ బీజేపీ ఉన్నాయి. అయితే టీడీపీ లౌకిక వాదం స్టాండ్ ని తీసుకుంది. ఆ పార్టీ మధ్యస్థ వాద విధానాలను అనుసరిస్తోంది. బీజేపీతో రాజకీయ పొత్తు తప్ప సిద్ధాంతపరంగా కొన్ని కీలకమైన విషయాలలో విభేదిస్తుంది అని అంటున్నారు. అయితే పవన్ కళ్యాణ్ మాత్రం బీజేపీ ఫిలాసఫీయే బెస్ట్ అంటున్నారు. దేశాన్ని కాపాడేది బీజేపీయే అని నినదిస్తున్నారు. ఇక పవన్ వంటి నాయకుడు ప్రజాకర్షణ కలిగిన నేత తమతో ఉండడం బీజేపీకి ఎంతో రాజకీయ లాభమే అని అంటున్నారు. సనాతన ధర్మం అన్నది పవన్ నోటి వెంట రావడం వల్లనే చర్చకు ఆస్కారం ఇచ్చింది. పవన్ హిందూత్వ నినాదాన్ని గట్టిగా వినిపిస్తే గ్రాస్ రూట్ లెవెల్ లో అది చొచ్చుకుని పోతుంది అని అంటున్నారు. ఆ విధంగా బేజేపీ హిందూత్వ విత్తనాలు క్షేత్ర స్థాయిలో గట్టిగా నాటడానికి పవన్ ఒక ప్రేరణ శక్తిగా ఉంటారని అంటున్నారు. ఇక పవన్ కి లాభమేంటి అంటే బీజేపీ జనసేనలకు ముఖ్యమంత్రి అభ్యర్థి పవనే అని అంటున్నారు. రేపు జమిలి ఎన్నికలు జరిగినా లేక షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు వచ్చినా కూడా కూటమితోనే పొత్తులు ఉంటాయని అంతా అంటున్నారు. ఆ విధంగా బీజేపీకి అత్యంత సన్నిహితుడైన మిత్రుడుగా ఉంటూ పవన్ ఆ పార్టీ మద్దతుతో కచ్చితంగా సీఎం పోస్టుకు బలమైన అభ్యర్ధిగా నిలుస్తారు అని అంటున్నారు. మొత్తానికి చూస్తే పవన్ హిందూత్వ నినాదానికి ఇది ఆరంభం మాత్రమే అని అంటున్నారు. జమిలి ఎన్నికలు వస్తే కనుక ఏపీలో అది మరింత గట్టిగా వినిపిస్తుంది అని అంటున్నారు. మరి వీర హిందూత్వ రాగాల మధ్య టీడీపీ ఏ విధంగా కూటమిలో సర్దుకుని పోతుంది అన్నది చూడాల్సి ఉంది అంటున్నారు. ఏది ఏమైనా బీజేపీ జనసేనలతో టీడీపీకి దోస్తీ అనివార్యం అయిన వేళ ఏపీలో రాజకీయ పరిణామాలు కూడా వేగంగా మారిపోతాయని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

## శామీర్ పేట పోలీస్ స్టేషన్ ను సందర్శించి, సీఐ, సిబ్బంది విధుల నిర్వహణ తీరును అభినందించిన డిజిపి






శామీర్ పేట, (గరుడ వార్త) : శామీర్పేట సిఐ శ్రీనాథ్‌తో పాటుగా సిబ్బంది విధుల నిర్వహణ తీరును రాష్ట్ర డిజిపి పరిశీలించి అభినందించారు. బుధవారం సాయంత్రం శామీర్ పేట పోలీస్ స్టేషన్ ను రాష్ట్ర డిజిపి ఐపీఎస్ డాక్టర్ జితేందర్ సందర్శించి పరిశీలించారు. ఇన్స్పెక్టర్ శ్రీనాథ్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ లోని కేసుల దర్యాప్తు, కేసుల ఏ విధంగా పరిష్కరిస్తున్నారో అడిగి తెలుసుకుని అడిగి తెలుసు కున్నారు.

అలాగే పోలీస్ స్టేషన్ పరిసరాలను పచ్చదనాన్ని పరిశీలించి ఇన్స్పెక్టర్ శ్రీనాథ్ తో పాటు పోలీస్ సిబ్బందిని అభినందించారు. రాష్ట్ర డిజిపి సందర్శించిన సమయంలో మేడ్చల్ డిసిపి ఎన్. కోటిరెడ్డి, పేట్ బషీరాబాద్ ఏసిపి రాములు, డీఐ గంగాధర్, ట్రాఫిక్ ఏసీపీ వెంకట్ రెడ్డి, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ హన్మంత్ గౌడ్, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సందిగ్ధంలో విద్యుత్తు ఉద్యోగుల బదిలీలు



భగత్‌నగర్ : విద్యుత్తు సంస్థలో ఉద్యోగుల బదిలీ ప్రక్రియ సందిగ్ధంలో ఉండిపోయింది. సోమవారం ఇవ్వాల్సిన బదిలీ ఉత్తర్వులు చివరి నిమిషంలో నిలిచిపోయాయి. మంగళవారం సైతం దీనిపై ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. ప్రస్తుతం బదిలీల ప్రక్రియపై ఉద్యోగులు అసంతృప్తిగా ఉన్నారు. సాధారణంగా మూడేళ్లు సర్వీసు నిండిన వారికే బదిలీ చేపట్టేవారు. కానీ ప్రస్తుతం రెండేళ్లకు కుదించడంతో ఎక్కువ మంది బదిలీ కావాల్సి వస్తోంది. ఓ ఉద్యోగి కొత్త ప్రాంతానికి వచ్చి కుదురుకోవడానికే ఆరు నెలల సమయం పడుతుంది. అలాంటిది రెండేళ్లకు అనేది వారికి అసౌకర్యంగా మారింది. ముఖ్యంగా ఇంజినీర్లను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లిన సమయంలో ఆ భౌగోళిక పరిస్థితులు అవగతం కావడానికి సమయం పడుతుంది. దీనికితోడు ఆయా సెక్షన్ల పరిధిలో చేసిన అభివృద్ధి పనుల భారం అధికంగా ఉంటుంది. ఒక్కో ఇంజినీరుకు 50 నుంచి 120 వరకు వర్క్ ఆర్డర్లు ఉంటాయి. బదిలీపై వెళ్లాక వాటిని పూర్తి చేయడానికి ఆరు నెలల సమయం పడుతుంది. ఆ ప్రాంతానికి వచ్చిన ఇంజినీరుకు ఆ ప్రాంతం అవగతం అవడానికి ఆరు నెలలు పడుతుంది. ఇలా ఇంజినీర్లకు ఇబ్బందే. ఇదే మూడేళ్ల సమయం ఉంటే వారు చివరి ఆరు నెలల్లో పనులను పూర్తి చేసుకునే అవకాశముంది.

### విద్యాసంవత్సరం మధ్యలో..

మొదట ట్రాన్స్‌కోలో బదిలీ మార్గదర్శకాలు విడుదలైన తరువాత డిస్కంలలో విడుదల జేసేవారు. ప్రస్తుతం ట్రాన్స్‌కోలో బదిలీ మార్గదర్శకాలు జారీకాకుండానే డిస్కంలలో జారీ చేశారు. సాధారణంగా జూన్, జులైలలో బదిలీ నోటిఫికేషన్ జారీ చేసేవారు. ప్రస్తుతం సెప్టెంబరులో బదిలీ ఉత్తర్వులు జారీ చేయడంతో ఉద్యోగుల పిల్లలకు విద్యాపరంగా ఇబ్బందులు వచ్చే అవకాశముంది.

### పైరవీలకు అడ్డుకట్ట..

ప్రస్తుత బదిలీల్లో ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి కొత్త విధానాన్ని తీసుకొస్తూ పైరవీలకు అడ్డుకట్ట వేశారు. గతంలో ఉద్యోగులు తాము బదిలీ కావాలని కోరుకున్న ప్రాంతాలను (ఐచ్ఛికాలను) ఆయా సంఘాల నాయకులకు ఇవ్వాల్సి వచ్చేది. ఆ విధానాన్ని సీఎండీ తొలగిస్తూ ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే అవకాశం ఇచ్చారు. ఏ ప్రాంతాలు కావాలో మూడింటిని ఎన్నుకోవాల్సి ఉంటుంది. ఇలా ఆన్‌లైన్‌లో తాము కోరుకున్న ప్రాంతాలు ఉద్యోగులు చూసుకునే వెసులుబాటు కల్పించారు. గతంలో ఉద్యోగి కోరుకున్నది ఒక ప్రాంతమైతే సంఘాల నాయకులు మరో చోటకు బదిలీ చేయించేవారు. ఆ ఇబ్బందిని ప్రస్తుతం తొలగించారు.

## సొంతానికి ఎక్కువ.. ఆర్థికాభ్యున్నతికి తక్కువ



కరీంనగర్ : మహిళలు ఆర్థికంగా ఎదగడానికి జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు బ్యాంకు లింకేజీతో రుణాలు అందజేస్తున్నారు. గతేడాది విధించిన లక్ష్యం చేరుకోవడంతో.. రాష్ట్ర స్థాయిలో అవార్డు సైతం సొంతం చేసుకున్నారు. ప్రస్తుతం 2024-25 లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. రుణాలు తీసుకున్న వారిలో అతికొద్ది మాత్రమే వ్యాపారానికి ఉపయోగించుకొని ఆర్థికాభ్యున్నతి పొందుతున్నారు. ఎక్కువ శాతం మంది సొంత అవసరాలకే వినియోగిస్తున్నారు. వారిలో అవగాహన పెంచాల్సిన ఆవశ్యకతపై 'న్యూస్‌టుడే' కథనం.

ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా స్వయం సహాయక సంఘాలకు ఏటా మంజూరు చేసిన రుణాన్ని.. సొంతానికి వినియోగించుకున్న అప్పులు చెల్లించడం, ఇతరాత్ర వాటికే మహిళలు ఉపయోగించుకుంటున్నారు. సొంతంగా ఏదైనా స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా ఎదిగేందుకు ఆలోచన చేయడంలేదు. అతి కొద్దిమంది మాత్రమే చిన్నపాటి వ్యాపారాలు చేస్తున్నారు. దీంతో మహిళలు పురోగతి సాధించాలనే ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మంజూరు చేసిన రుణమొత్తానికి ఆర్థికంగా ఎదిగేలా ప్రోత్సహిస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

### అవగాహన అవసరం

మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకొని వ్యాపారాలు చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తోంది. వారందరూ రుణాలు తీసుకునేలా ఏటా లక్ష్యాన్ని విధిస్తోంది. అధికారులు ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా నాలుగు లక్షలకుపైగా సభ్యురాళ్లకు రుణాలు మంజూరు చేస్తే.. అందులో కనీసం వందల్లో కూడా ఆర్థికంగా రాణిస్తున్న వారు లేకపోవడం విశేషం. ప్రస్తుతం పలు సంఘాలు ఏటా రూ.3 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు రుణం తీసుకుంటున్నాయి.

### ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం

మహిళలు ఆర్థికాభ్యున్నతి సాధించడానికి ప్రస్తుతం ఇందిరా మహిళా శక్తి ద్వారా సొంతంగా వ్యాపారాలు నిర్వహించేలా తగిన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. వ్యాపారాలు ప్రారంభించి లాభాన్ని అర్జించేలా అధికారులు సూచనలు చేస్తూ పర్యవేక్షించేలా చూస్తాం.శ్రీధర్, కరీంనగర్ జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి

## ఎదురుచూపులు ఉండవిక..!

భానుపురి: సీసీఐకి పత్తి విక్రయించిన రైతులకు ఇక నుంచి దిగులుండదు. నగదు బ్యాంకు ఖాతాలో పడే వరకు ఉత్కంఠగా ఎదురుచూస్తున్న వారికి ఇక నుంచి ఆ ఇబ్బందులు ఉండవు. సమయానికి నగదు జమ కాకపోవడంతో అధికారుల వద్దకు వెళ్లి వాకబు చేస్తుంటారు. ఇందుకు గ్రామాల నుంచి పట్టణంలోని కార్యాలయాలకు వెళ్లొస్తుంటారు. అటు సీసీఐ కార్యాలయాల చుట్టూ అన్నదాతలు తిరిగిన సందర్భాలూ ఉన్నాయి. ఈ ఇబ్బందులను అధిగమించేందుకు సీసీఐ 'కాటన్-అల్లై' పేరుతో కొత్త యాప్‌ను కొనుగోళ్ల వరకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కసరత్తు చేస్తోంది. ఇది అందుబాటులోకి వస్తే మేలు చేకూరనుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 7.18 లక్షల ఎకరాల సాగుఉమ్మడి నల్గొండ జిల్లాలో ఈసారి 7.18 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేపట్టారు. అంతర్జాలం వినియోగం పెరిగిన నేపథ్యంలో ప్రతి ఇంట్లో స్మార్ట్‌ఫోన్ అందుబాటులో ఉంటోంది. సీసీఐ తీసుకొచ్చే యాప్ ద్వారా పత్తి నగదు చెల్లింపు ప్రక్రియ ఏ మేరకు వచ్చిందనే కచ్చితమైన సమాచారం తెలుసుకునేందుకు వీలు కలుగుతుందని అధికారులు చెబుతున్నారు. సాధారణంగా ఎకరాకు 15 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పలుచోట్ల పంట దెబ్బతింది. దీంతో దిగుబడిపై రైతుల్లో దిగులు నెలకొంది. సరాసరి ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో పత్తి సాగు వివరాలు (ఎకరాల్లో..)సూర్యాపేట - 78,094నల్గొండ - 5,40,022 యాదాద్రి - 1,00649

## ఆ అలవాటుకు.. 25 ఏళ్లు

మిర్యాలగూడ : చిన్నతనంలో తమ ఇంటికి వచ్చే ఉత్తరాల స్టాంపులు సేకరించడం అలవాటుగా మారిన అతడికి.. చదువుకునే వయసులో బహుమతిగా వచ్చిన నేపాల్ కరెన్సీ నోటు.. వివిధ దేశాల కరెన్సీ నోట్ల సేకరణకు ప్రాణం పోసింది. దీంతో 25 ఏళ్లుగా వేలాది స్టాంపులు, నాణేలు, నోట్లు సేకరించిన అతడు.. నేటితరం చిన్నారులకు వాటి గురించి తెలియజేయాలనే ఉద్దేశంతో తన వ్యాపార ప్రాంతంలో ప్రదర్శిస్తున్నాడు. మిర్యాలగూడ పట్టణానికి చెందిన గరిణె ఠాగూర్.. డిగ్రీ పూర్తి చేసి ప్రస్తుతం వస్త్ర దుకాణం నిర్వహిస్తున్నాడు. 1998లో నాలుగో తరగతి చదువుతున్నప్పుడు తన ఇంటికి వచ్చే ఉత్తరాల నుంచి స్టాంపులు సేకరించడం మొదలు పెట్టాడు. ఆ తర్వాత రెండేళ్లకు తమ ఇంటి సమీపంలోని ఓ వసతిగృహానికి కాపలాదారుగా ఉన్న నేపాల్ వ్యక్తిని వారి నగదు ఎలా ఉంటుందని అడుగగా.. అతడొక నోటును బహుమతిగా ఇచ్చాడు. దానిని మురిపెంగా చూసుకుని ఇతర దేశాల కరెన్సీ ఎలా ఉంటుందో తెలుసుకోవాలనుకున్నాడు. దీంతో దీనినే తన అలవాటుగా మలచుకుని నేటి వరకు సుమారు వంద దేశాల నుంచి సేకరించిన 2వేల నోట్లు, 5వేల నాణేలు, వివిధ దేశాలకు చెందిన 4వేల స్టాంపులు సేకరించాడు. వీటితో పాటు దేశానికి చెందిన సుమారు 400 రకాల అగ్గిపెట్టెలు సైతం



సేకరించాడు. వీటి విలువ సుమారు రూ.10లక్షలకు పైగానే ఉంటుందని అంచనా.

### పురాతనం నుంచి అధునాతనం వరకు..

ఠాగూర్ సేకరించిన వాటిలో పురాతన కాలం నుంచి ఇటీవలి వరకు కరెన్సీ నోట్లు, స్టాంపులు ఉన్నాయి. నిజాం నవాబుల కాలం నాటి స్టాంపులు, కరెన్సీ నోట్లతో పాటు వెండి నాణేలు, ఢిల్లీ సుల్తానుల, తమిళనాడు చోళ రాజుల, మైసూర్ టిప్పు సుల్తాన్ కాలాల నాటి నాణేలు సైతం సేకరించాడు. వీటితో పాటు ఇటీవల హాంకాంగ్, రష్యా, ఈస్ట్ కరేబియాన్, న్యూజిలాండ్, సోలోమన్ ఐలాండ్, సింగపూర్, మాల్దీవులు తదితర దేశాలు ప్రవేశ పెట్టిన పాలిథిన్ కరెన్సీ నోట్లు సైతం సేకరించాడు. వీటిలో ప్రపంచంలోనే అతి విలువైన దుబాయ్ కరెన్సీతో పాటు తక్కువ విలువైన ఇండోనేషియా కరెన్సీ నోట్లు సేకరించాడు. యుగోస్లేవియాలో పాత నోట్లు రద్దు చేసిన సమయంలో ముద్రించిన కొత్త నోట్లు సైతం ఇతడి సేకరణలో భాగమయ్యాయి. ఇండోనేషియా కరెన్సీ నోటుపై వినాయకుడి చిత్రం, క్యూబా కరెన్సీ నోటుపై చెగువెరా చిత్రం ముద్రించిన నోట్లు సైతం సేకరించి ఔరా అనిపిస్తున్నాడు.

### పిల్లలకు తెలియజేయాలనే

గరిణె ఠాగూర్, మిర్యాలగూడ

తపాలా స్టాంపులు, కరెన్సీ నోట్లు, నాణేలను విక్రయించాలన్న ఆలోచన ఎప్పుడూ చేయలేదు. వాటిని పెట్టెల్లో నిరుపయోగంగా ఉంచడం కంటే.. మా దుకాణానికి వచ్చే చిన్నారులకు వివిధ దేశాల కరెన్సీ,. తపాలా స్టాంపుల గురించి తెలియజేయాలనే ఉద్దేశంతో నోట్లను టేబుల్‌పై అద్దం కింద పేర్చాను. వీటిని చూసిన చిన్నారులు వివిధ కరెన్సీ నోట్లు, వాటి విలువ, ప్రత్యేకతల గురించి వచ్చే సందేహాలను నివృత్తి చేస్తున్నాను.

## నేడు శామీర్పేట లోని పాలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం

శామీర్ పేట, (గరుడ వార్త) : పలు ప్రాంతాల్లో నేడు విద్యుత్ అంతరాయం ఉండబోతోందని శామీర్ పేట విద్యుత్ ఏ ఈ రాఘవేందర్ రావు ఓ ప్రకటనలో బుధవారం పేర్కొన్నారు. గురువారం శామీర్ పేట విద్యుత్ సబ్‌స్టేషన్లో ఎన్ టి ఆర్ ఓ పీడర్ మరమత్తుల కారణంగా ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. ఈ పీడర్ మరమ్మత్తు కారణంగా పెద్దమ్మ కాలనీ, బి జి ఎల్, నల్సార్ యూనివర్సిటీ, ఎన్ టి ఆర్ ఓ, సెలబ్రిటీ రిసార్ట్స్, శామీర్ పేట మెయిన్ రోడ్ ప్రాంతాలలో విద్యుత్ అంతరాయం ఉంటుందని చెప్పారు. ఈ విషయం విద్యుత్



వినియోగదారులు గమనించి సహకరించాలని ఏఈ కోరారు.


అలియాబాద్ సెక్షన్ పరిధిలో....అలియాబాద్ సెక్షన్ పరిధిలో నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని అలియాబాద్ ఏ ఈ వెంకటనారాయణ ఓ ప్రకటనలో బుధవారం పేర్కొన్నారు. గురువారం కేశవరం సబ్ స్టేషన్ లో అద్రాస్ పల్లి ఫీడర్ మరమ్మత్తుల కారణంగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. ఈ ఫీడర్ మరమ్మత్తుల కారణంగా కేశవరం గ్రామం, సంగీత్ ఫంక్షన్ హాల్, జగ్గం గూడ రోడ్డు వ్యవసాయ కనెక్షన్లకు విద్యుత్ అంతరాయం ఉంటుందని చెప్పారు. ఈ విషయం విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఏఈ కోరారు.

# వ్యర్థాలకు అర్థం చెబుదాం

సిద్దిపేట: పెరుగుతున్న జనాభా.. మితిమీరిన అవసరాలు.. ఇబ్బడిముబ్బడిగా వివిధ ఉత్పత్తుల వినియోగంతో వ్యర్థాలు అంతకంతకు పేరుకుంటున్నాయి. ప్రణాళిక లేకపోతే గుట్టలుగా మారడం ఖాయం. ఫలితంగా ఎదురయ్యే కాలుష్యం, కలుషితం.. పర్యావరణం, జీవజాతులకు ముప్పుగా పరిణమిస్తుంది. కాస్త ఆలోచిస్తూ.. ప్రణాళికతో సాగితే పునర్వినియోగంగా మార్చడం సులువే. ఇందుకు నిదర్శనమే సిద్దిపేట బల్దియా. వ్యర్థాలతో సంపద సృష్టించవచ్చని నిరూపించిన ఈ బల్దియాను.. ఇటీవల రాష్ట్రంలోని ఇతర పురపాలికల అధికారులు సందర్శించారు.

**ప్రైవేటు పరిశ్రమలకు..**

సిద్దిపేట హౌసింగ్‌బోర్డు కాలనీ, పట్టణ శివారులో పొడి వ్యర్థాల వనరుల సేకరణ కేంద్రాలు (డీఆర్‌సీసీ) నిర్వహిస్తున్నారు. గృహ, వాణిజ్య సముదాయాల నుంచి వెలువడే పొడి వ్యర్థాలను సేకరించి వివిధ ప్రాంతాలకు చెందిన రీసైక్లింగ్ యూనిట్లకు తరలిస్తున్నారు. కవర్లు, కాగితాలు, అట్టముక్కలు ప్రైవేటు పరిశ్రమలకు విక్రయిస్తున్నారు. వాటితో ఫైల్స్, ఎగ్ ట్రేలు తయారు చేస్తున్నారు. పొడి చెత్తతో ప్రతి నెలా రూ.11.15 లక్షలు సమకూరుతోంది.



**మురుగునీటిని శుద్ధి చేసి..**

2019లోనే సిద్దిపేటలో చింతల్‌చెరువు వద్ద మురుగునీటి శుద్ధి కేంద్రం (ఎస్‌టీపీ) ఏర్పాటైంది. 2022లో నర్సాపూర్ వద్ద మరోటి నిర్మించారు. విలీన, శివారు కాలనీలు మినహా పట్టణంలోని అన్ని వార్డులకు అనుసంధానంగా భూగర్భ మురుగు (యూజీడీ) వ్యవస్థను ఆయా కేంద్రాలకు అనుసంధానం చేశారు. రోజులో రెండు చోట్ల కలిపి 15 ఎంఎల్‌డీల మేర మురుగు నీటిని శుద్ధి చేస్తున్నారు. మూడు దశల్లో ఇది జరుగుతోంది. వారంలో 2.5 టన్నుల వరకు ఎరువు ఉత్పత్తి అవుతోంది. శుద్ధి అనంతరం వెలువడే నీటిని మొక్కల పెంపకానికి వినియోగిస్తున్నారు. మిగిలిన నీటిని చెరువులకు తరలిస్తున్నారు.

**సేంద్రియం.. స్ఫూర్తిదాయకం**

తడి చెత్తను సేంద్రియంగా మారుస్తున్నారు. నాలుగు వార్డుస్థాయి కంపోస్టు యూనిట్లు, బుస్సాపూర్‌లో బయో సీఎన్‌జీ ప్లాంట్, ఆరుబయట సేంద్రియ (విండో కంపోస్టు) ఎరువు తయారు చేస్తున్నారు. తడి చెత్త సాయంతో ప్లాంట్‌లో గ్యాస్ ఉత్పత్తి చేస్తూ హోటళ్లకు విక్రయిస్తున్నారు. గ్యాస్ ఉత్పత్తి సహా సేంద్రియ ఎరువు ద్వారా రూ.10.56 లక్షల వరకు ప్రతి నెలా ఆర్జిస్తున్నారు. సిద్దిపేట స్వచ్ఛబడిలోనూ నమూనాగా.. వృథా వస్తువులు, వ్యర్థాలతో ఆకృతులు తీర్చిదిద్దారు.

# వసతులు లేక.. వరండానే దిక్కు...

మెదక్ : సర్కారు ఆసుపత్రుల్లో రోగుల వెంట వచ్చే సహాయకులు సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళల్లో నిద్రించేందుకు కనీసం షెడ్డు లేకపోవడంతో వరండానే దిక్కవుతోంది. ఆరుబయట పడుకోవడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని నిద్రిస్తున్నారు. ఆసుపత్రి సిబ్బంది నుంచి చీదరింపులు తప్పడం లేదు. రూ.కోట్లతో పక్కా భవనాలు నిర్మించే పాలకులు... వసతికి కనీసం భవనం, షెడ్ నిర్మాణంపై దృష్టి సారించడం లేదు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగుల సహాయకుల ఇక్కట్లపై బృందం పరిశీలించింది.

**ఆరుబయటే నిద్రిస్తూ..**

జిల్లా కేంద్రం మెదక్‌లో ప్రభుత్వ ఆసుపత్రి, మాతాశిశు సంరక్షణ కేంద్రం(ఎంసీహెచ్), నర్సాపూర్‌లో ప్రాంతీయ ఆసుపత్రి, తూప్రాన్, రామాయంపేట, కౌడిపల్లిలో సామాజిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఇన్ పేషెంట్ ఉండే రోగుల వెంట ఒకరిద్దరు సహాయకులు వస్తారు. రాత్రి కాగానే వీరిని ఆసుపత్రుల నుంచి బయటకు పంపుతారు. దీంతో వారు ఆరు బయటే నిద్రిస్తున్నారు.

**ఇదీ పరిస్థితి....**

మెదక్‌లోని మాతాశిశు సంరక్షణ కేంద్రంలో ప్రసవాలు జరుగుతాయి. దీంతో ఆసుపత్రిలో రద్దీ ఉంటుంది. బాలింతల వెంట ఉండే కుటుంబ సభ్యులు ఆసుపత్రి బయటే నిద్రిస్తున్నారు. ఆసుపత్రి నిర్మాణ సమయంలో గుత్తేదారు ఓ చిన్న షెడ్ నిర్మించారు. అందులో చాలా తక్కువ మంది పడుకుంటున్నారు. ఆసుపత్రి వెనకాల పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిరాశ్రయుల కోసం భవనాన్ని నిర్మించారు. ఇందులో రోగుల సహాయకులు నిద్రించేందుకు అవకాశం ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం రాత్రివేళ ఆరుబయట నిద్రించడంతో చలికి వణికిపోతున్నారు. మాతాశిశు సంరక్షణ కేంద్రంలో షెడ్డు నిర్మించేందుకు గతంలో ప్రయత్నాలు జరగగా.. ఎవరూ పట్టించుకోక సహాయకులు ఇబ్బందులు పడుతున్నారు.

తూప్రాన్‌లోని 50 పడకల ఆసుపత్రిలో రోగుల సహాయకులకు ప్రత్యేక గదులు లేకపోవడంతో వైద్య సేవలు పొందుతున్న వారి పక్కనే కింద పడుకుంటున్నారు. మరికొంత మంది వేచి ఉండే గదిలో బల్లాలపై కింద పడుకుంటున్నారు. ఐదేళ్లుగా ఇదే పరిస్థితి ఉన్నా.. ఉన్నతాధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నర్సాపూర్‌లోని ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలో రోగుల సహాయకులు విశ్రాంతి తీసుకోవడానికి ఎలాంటి వసతులు లేవు. రాత్రిపూట రోగులకు తోడుగా.. పక్కన మంచం ఖాళీగా ఉంటే దానిపై సర్దుకుంటున్నారు. లేదంటే నేలపైనే పడుకుంటున్నారు. ప్రత్యేక గది అంటూ ఏదీ లేదు. ఆసుపత్రిలోని వరండాలోనే రాత్రిపూట నిద్రిస్తున్నారు. పగటిపూట రోగులు కూర్చునేందుకు నర్సాపూర్ స్నేహబంధు లయన్స్ క్లబ్ ఒక షెడ్ నిర్మించింది. లేదంటే చెట్ల మధ్యలో కూర్చుని ఆహారం తింటున్నారు. కోతుల కారణంగా ఆరుబయట కూర్చోలేని దుస్థితి నెలకొంది. దీంతో ఎక్కువ మంది ఆసుపత్రి వరండాలో సేదతీరుతున్నారు.

రామాయంపేటలోని 30 పడకల సామాజిక ప్రభుత్వ ఆసుపత్రిలో వసతులు లేక సహాయకులు రోగుల మంచం పక్కన, వరండాలో పడుకుంటున్నారు.

దాతలు ముందుకు రావాలి

ఆసుపత్రుల్లో ఉన్న రోగులకు మాత్రమే సౌకర్యాలు కల్పిస్తాం. వారి సహాయకులకు వసతి ఏర్పాటుపై ప్రభుత్వపరంగా ఎలాంటి ఆదేశాలు లేవు. షెడ్ల నిర్మాణానికి ప్రజాప్రతినిధులు ఎవరైనా ఆసక్తి చూపితే వారికి ఆశ్రయం లభిస్తుంది. శివదయాల్, జిల్లా సమన్వయకర్త, ప్రభుత్వ ఆసుపత్రులు.

# మెట్రో షహర్.. పైపైకి పవర్



హైదరాబాద్ : నగరంలో రాబోయే రోజుల్లో మెట్రోరైలు సేవలు మరింత విస్తరించనున్నాయని విద్యుత్తు సంస్థ అంచనా వేసింది. గత ఆర్థిక సంవత్సరంలో మెట్రోరైలు నడిపేందుకు 103 మిలియన్ యూనిట్ల విద్యుత్తుని వినియోగించింది. ఈ ఏడాది వినియోగం 134 మిలియన్ యూనిట్లకు పెరుగుతుందని అంచనా.

నగరంలో మెట్రోరైలు ప్రస్తుతం మూడు కారిడార్లలో 69.2 కి.మీ. మేర అందుబాటులో ఉంది. నిత్యం 1100పైగా ట్రిప్పులు తిరుగుతున్నాయి. పూర్తిగా కాలుష్య రహితంగా విద్యుత్తుతోనే మెట్రోరైళ్లు నడుస్తున్నాయి. ఇందుకోసం ప్రత్యేకంగా మూడు ప్రాంతాల్లో 132 కేవీ ఉపకేంద్రాల సహాయంతో డిస్కం మెట్రోకి నిరంతరాయ కరెంట్‌ను సరఫరా చేస్తోంది. ఇందుకోసం నాగోల్, మియాపూర్, యూసఫ్‌గూడలో ఉపకేంద్రాలను నిర్మించింది. మెట్రోరైళ్లు బ్రేక్ వేయడం ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్తును కొంత వినియోగించుకుంటుండగా మిగతాది డిస్కం హెచ్‌టీ కేటగిరి 5(బి) కింద సరఫరా చేస్తోంది. గతేడాది 103 మిలియన్ యూనిట్లు సరఫరా చేయగా.. 2027-28 నాటికి 373 మిలియన్ యూనిట్లకు పెరుగుతుందని డిస్కం అంచనా వేసింది. ఇప్పుడున్న మార్గంలో అదనపు కోచ్‌లు, ట్రిప్పులు నడపడం, రెండోదశ అందుబాటులోకి వస్తుందని లెక్కలు వేసింది.

**కోచ్‌లకు డిమాండ్..**

ప్రస్తుతం సిటీలో 57 మెట్రోరైలు కోచ్‌లు నడుస్తున్నాయి. రద్దీసమయాల్లో ఇవి కూడా చాలడం లేదు. ప్రయాణికులు ఉదయం, సాయంత్రం కిక్కిరిసివెళుతున్నారు. అమీర్‌పేట నుంచి రాయదుర్గం వెళ్లడం ప్రయాణికులకు నిత్యనరకంగా మారింది. ఇప్పుడున్న మూడు కోచ్‌లను ఆరుకు పెంచాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. కానీ నిధుల సమస్య అని ఆ సంస్థ దాటవేస్తోంది. ఇదివరకు నాగ్‌పూర్ నుంచి లీజుకు నాలుగు మెట్రోరైళ్లను తీసుకునేందుకు ప్రయత్నాలు జరిగాయి. ఆ తర్వాత పురోగతి లేదు. ఈ లోపు నాగ్‌పూర్ మెట్రో అవసరాలు పెరిగాయి. దీంతో పుణె మెట్రో నుంచి కోచ్‌లను తీసుకునే ఆలోచన చేస్తున్నట్లు ఎల్ అండ్ టీ మెట్రోలోని ఒక అధికారి తెలిపారు. వీటి రాకతో ఎక్కువ ట్రిప్పులు తిరిగేందుకు అవకాశం ఉంటుంది. విద్యుత్తు వినియోగమూ పెరుగుతుంది.

**రెండోదశ వస్తే..**

మెట్రోరైలు రెండోదశలో 76.4 కి.మీ. ప్రతిపాదించింది. నాలుగేళ్లలో పూర్తిచేయాలనేది ప్రభుత్వ లక్ష్యం. తొలుత పాతబస్తీ 7.5 కి.మీ. మార్గం పనులు పూర్తయ్యే అవకాశం ఉంది. దశలవారీగా కారిడార్లు పూర్తికానున్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకుని డిస్కం విద్యుత్తు వినియోగ అంచనాలు వేసింది. నాలుగేళ్లలో మెట్రో వినియోగం 373 మిలియన్ యూనిట్లకు పెరుగుతుందని ఏఆర్‌ఆర్‌లో ప్రతిపాదించింది.

# అమ్మా నీకు భారమైతే.. ఆదరిస్తుంది ఊయల



హైదరాబాద్ : పొత్తిళ్లలో భద్రంగా దాచుకోవాల్సిన బిడ్డను కన్నతల్లి వద్దనుకుంటోంది. వేలు పట్టుకుని నడిపించాల్సిన తండ్రి నాకెందుకీ భారమనుకుంటున్నాడు. ఫలితం నెలలు కూడా నిండని పసికందులు చెత్తకుప్పలు, నడి వీధుల్లో ప్రత్యక్షమవుతున్నారు. ఆడపిల్ల పుట్టిందనో.. పసికందు అనారోగ్యంతో ఉందని.. కాళ్లు వంకరగా ఉన్నాయని.. ఆర్థిక భారం కారణమేదైనా కొందరు ముక్కుపచ్చలారని పసికందులను నడివీధుల్లో విసిరేస్తున్నారు. తాజాగా ఆదివారం తెల్లవారుజామున సూరారంలో అప్పుడే పుట్టిన పసికందును ప్లాస్టిక్ కవర్లో వేసి నడిరోడ్డుపై వదిలేసిన ఘటన తీవ్రంగా కలచివేసింది. పసిబిడ్డ సరైన వైద్యం అందక మృతిచెందాడు. ఇదొక్క ఘటనే కాదు.. నగరంలో ఏటా పదుల సంఖ్యలో ఇలా చిన్నారులను వదిలేస్తున్న ఘటనలు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే కన్నపిల్లలను పెంచలేని పరిస్థితుల్లో ఉంటే అమీర్‌పేటలోని శిశువిహార్‌లో అప్పగించాలని, పోషకాహారం, వసతి సమకూర్చి విద్యను నేర్పిస్తూ కన్నబిడ్డలా కాపాడుకుంటామని స్పష్టం చేస్తున్నారు.

**పెంచలేకపోతే.. సంప్రదించండి**

రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ గతంలో 'ఉయల' పథకాన్ని ప్రారంభించింది. తల్లిదండ్రులె వరైనా తమ బిడ్డలను పెంచలేని పరిస్థితుల్లో ఉంటే రాష్ట్రస్థాయిలో అమీర్‌పేటలోని శిశువిహార్, జిల్లాల్లో శిశు గృహాలను సంప్రదించవచ్చు. అధికారులు తల్లిదండ్రులతో మాట్లాడి చిన్నారులను వదులుకోవడానికి గల కారణాలను తెలుసుకుంటారు. అవసరమైతే కౌన్సిలింగ్ ఇస్తారు. అప్పటికీ తల్లిదండ్రుల్లో మార్పురాకుంటే.. సంరక్షణ బాధ్యత తీసుకుంటారు. కొన్ని నెలలు తర్వాత మళ్లీ తల్లిదండ్రులను పిలిచి చిన్నారిని తీసుకుంటారా..? లేదా..? అని ఆరా తీస్తారు. అప్పటికీ అంగీకరించకపోతే చిన్నారి పూర్తి సంరక్షణ బాధ్యతను శిశువిహార్ అధికారులు తీసుకుంటారు. ఆ తర్వాత చట్టబద్ధంగా దత్తతకు అర్హులైన పిల్లలుగా గుర్తిస్తారు. కారా వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకున్న పిల్లల్లేని వారికి అప్పగిస్తారు. ఇలా హైదరాబాద్ శిశు విహార్‌కు ఏటా 150- 200 మంది చిన్నారులు వస్తున్నట్లు అధికారులు తెలిపారు. శిశువిహార్లో ఉన్నత చదువులు అభ్యసించి మంచి ఉద్యోగాలు సాధించిన వారు ఎందరో ఉన్నారు. ఆరేళ్లలోపు చిన్నారులను ఎవరైనా దత్తత తీసుకునేందుకు ముందుకొస్తే కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆర్థిక నేపథ్యం సహా అన్ని వివరాలు పరిశీలించి అప్పగిస్తున్నారు.

**రోడ్డు పక్కన నవజాత శిశువు**

సూరారం విశ్వకర్మకాలనీ రహదారి పక్కన ఓ దుకాణం ముందు అప్పుడే పుట్టిన నవజాత శిశువును ప్లాస్టిక్ కవర్‌లో పెట్టి వెళ్లిన వైనం కలకలం సృష్టించింది. ఆదివారం ఉదయం ఓ వ్యక్తిపసిబిడ్డ ఏడుస్తున్న చప్పుడు రావడంతో దగ్గరకు వెళ్లి చూడగా కవరులో నవజాత మగ శిశువు ఉన్నట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు చేరుకునే లోపే వనజ అనే ఓ మహిళ తాను ఆ బిడ్డను పెంచుకుంటానని ముందుకు వచ్చింది. వెంటనే ఆ శిశువును చికిత్స కోసం సూరారంలోని ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సూరారం కాలనీ 'మనం లైఫ్ సేవర్స్ సేవా సంస్థ'కు మృత శిశువును అప్పగించడంతో అంత్యక్రియలు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. కాలనీ రహదారిలోని సీసీ కెమెరాల ఆధారంగా ఆ శిశువును పడేసిన వారిని గుర్తించేందుకు చర్యలు చేపడుతున్నట్లు సూరారం సీఐ భరత్‌కుమార్ తెలిపారు.

# ఎకో పార్కుగా ఎల్ మడుగు!


మంథని : గలగల పారే గోదావరి ఒడ్డున పచ్చని చెట్లు.. కనుచూపు మేర నీటి ప్రవాహం.. ఎటు చూసినా ప్రకృతి రమణీయత ఉట్టి పడే ఎల్‌మడుగు వన్యప్రాణుల పెంపక కేంద్రం ఇకపై ఎకో పార్కుగా మారనుంది. ఈ మేరకు ప్రతిపాదనలు రూపొందించారు. మంథని పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి ఎల్-మడుగు వరకు 5 కిలోమీటర్ల దూరం తారు నిర్మాణానికి రూ.5 కోట్లు మంజూరయ్యాయి. రవాణా సౌకర్యం మెరుగు పడనుండటంతో పర్యాటకుల సంఖ్య పెరగనుంది.

**రూ.2 కోట్లతో ప్రతిపాదనలు**

రాష్ట్ర ఐటీ పురపాలక శాఖ మంత్రి శ్రీధర్‌బాబు గత నెల 28న మంథనిలో నిర్వహించిన సమావేశంలో ఎల్‌మడుగు వద్ద ఎకో పార్కు ఏర్పాటుకు రూ.2 కోట్లతో ప్రతిపాదనలు పంపాలని రాష్ట్ర పర్యాటక శాఖ కమిషనర్‌ను ఆదేశించారు. పర్యాటక కేంద్రంగా ఏర్పాటుకు సీఎస్‌ఆర్ నిధులు మంజూరు చేయాలని ఎన్టీపీసీ ఈడీని కోరారు. వన్యప్రాణుల కేంద్రం అభివృద్ధికి అటవీ శాఖ రూ.46 లక్షలు మంజూరు చేసింది. కేంద్రం వద్ద వాచ్ టవర్ అభివృద్ధి, బోటింగ్, సోలార్ విద్యుత్తు, గడ్డి పెంపకానికి నిధులు మంజూరయ్యాయని అటవీ శాఖ మంథని క్షేత్రాధికారి రమేష్ రాథోడ్ తెలిపారు.

**600 మీటర్ల కంచె ఏర్పాటు**

పెద్దపల్లి జిల్లా మంథని మండలం ఖానాపూర్, మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం శివ్వారం మధ్యలో ఉన్న గోదావరి తీరంలో 1982లో అటవీశాఖ శివ్వారం మొసళ్ల పెంపక కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. వన్యప్రాణుల సంరక్షణ చట్టం కింద మంథని మండలం ఆరెంద నుంచి విలోచవరం వరకు, మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం నాగపురం నుంచి పొనూరు వరకు నిషేధిత ప్రాంతంగా ప్రకటించారు. శివ్వారం పెంపక కేంద్రంలో 40 వరకు మొసళ్లున్నాయి. భారీ వర్షాలకు నది ప్రవాహంలో అవి కొట్టుకుపోయే ప్రమాదం ఉండటంతో మంథని మండలం ఖానాపూర్ నుంచి ఖాన్‌సాయిపేట వరకు గోదావరి ఒడ్డున



600 మీటర్ల మేర కంచె ఏర్పాటు చేసి మొసళ్లు పొలాల్లోకి రాకుండా చర్యలు చేపట్టారు.

**బోటింగ్ సౌకర్యం కల్పించాలి**

ఎల్-మడుగు వద్ద బోట్లు అందుబాటులోకి తీసుకొస్తే కేంద్రాన్ని సందర్శించే పర్యాటకుల సంఖ్య పెరగనుంది. మంచిర్యాల జిల్లా శివ్వారం వైపు ఇప్పటికే ఈ సౌకర్యం ఉండగా ఎల్ మడుగు వద్ద కూడా కల్పించాల్సి ఉంది.

**పెరగనున్న మొసళ్ల సంఖ్య**

శివ్వారం వద్ద గోదావరి ఒడ్డున వాచ్‌టవర్ ఏర్పాటు చేసి, చేపలు పట్టకుండా నిఘా ఉంచారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో పర్యాటకుల కోసం ఆధునిక పడవలు ఏర్పాటు చేశారు. నది అవతలి వైపు పురాతన ఆలయం, పచ్చిక బయళ్లతో ఉన్న ఈ ప్రాంతాన్ని పర్యాటకులు సందర్శిస్తున్నారు. ప్రస్తుతం గోదావరిలో నీరు తగ్గడంతో శివ్వారం ఒడ్డున ఉన్న బండ రాళ్ల మధ్య మొసళ్లు గుడ్లు పెట్టి, సంతానోత్పత్తికి అవకాశం ఏర్పడింది. దీంతో మొసళ్ల సంఖ్య పెరగనుంది.

# ధాన్యం.. కుప్పలు తిప్పలు

మెదక్ : జిల్లా వ్యాప్తంగా ధాన్యం విక్రయించేందుకు రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తున్నారు. వానొస్తే ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు అవసరమయ్యే టార్పాలిన్లను కొనుగోలు కేంద్రాల నిర్వహకులు రైతులకు సమకూర్చడం లేదు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడుస్తున్న ఘటనలు ప్రతి సీజన్‌లో పునరావృతం అవుతున్నా.. ప్రభుత్వం సరిపడా టార్పాలిన్లు పంపిణీ చేయకపోవడం గమనార్హం. జిల్లా మార్కెటింగ్ శాఖ సమకూరుస్తున్న అరకొర వాటిని రైతులకు పంపిణీ చేయడంతో పీఏసీఎస్‌లు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు అలసత్వం వహిస్తున్నారు. పలు రకాల తెగుళ్ల కారణంగా పంట దిగుబడి తగ్గి నష్టాల బారినపడుతున్న రైతులపై.. టార్పాలిన్ల అద్దె భారం పడుతోంది.

**క్షేత్రస్థాయిలో కనిపించక..**

జిల్లా మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో గత 7 సీజన్ల నుంచి ఆయా ఏఎంసీలు, కొనుగోలు కేంద్రాలకు 7047 టార్పాలిన్లు అందజేయగా, ప్రస్తుత సీజన్‌లో మెదక్-1500 రామాయంపేట-360 ఏఎంసీల ద్వారా 1860 పంపిణీ చేశారు. కానీ జిల్లా వ్యాప్తంగా ఉన్న కొనుగోలు కేంద్రాల్లో ఇవి కనిపించడం లేదు. జిల్లా అధికారుల లెక్కల ప్రకారం ఇప్పటి వరకు ఆయా కొనుగోలు కేంద్రాలకు 8907 పంపిణీ చేశారు. ఇందులో కొన్ని కేంద్రాల్లో వారి దగ్గర అందుబాటులో ఉన్న వాటిని రైతులకు అందజేస్తుండగా.. చాలా వరకు నిర్వాహకులు ఇవ్వడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. మార్కెటింగ్ శాఖ నుంచి కొనుగోలు



కేంద్రాలకు వచ్చిన టార్పాలిన్లు రైతులకు సరిగా ఇవ్వడం లేదు. వాస్తవానికి సీజన్ పూర్తి అయిన వెంటనే మరలా మార్కెటింగ్ శాఖకు ఇవ్వాలి. కానీ జిల్లాల్లో అలా ఇవ్వడం లేదు. వాటికి లెక్కలు కూడా లేవు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి టార్పాలిన్లు అందించాలని రైతులు కోరుతున్నారు.

**కొత్తవాటికి ప్రతిపాదనలు పంపాం**

అకాల వర్షాలతో ధాన్యం తడిసిపోకుండా రైతులకు ఆయా కొనుగోలు కేంద్రాల ద్వారా మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో టార్పాలిన్లు పంపిణీ చేస్తున్నాం. ఇందులో ఇప్పటి వరకు మొత్తం 8907 పంపిణీ చేశాం. ఈ సీజన్ 7300 టార్పాలిన్ల కోసం గత నెలలో ప్రతిపాదనలు పంపాం. అవి రాగానే కొనుగోలు కేంద్రాల వారీగా పంపిణీ చేస్తాం. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఒకవేళ రైతులకు ఇవ్వకపోతే ప్రశ్నించాలి. యాదగిరి, జిల్లా మార్కెటింగ్ అధికారి.

# ప్రతిభ చూపితే.. భవిత మీదే!

భువనగిరి : సర్కారు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించాలనే సదుద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఏటా ఎన్‌ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్) అర్హత పరీక్ష నిర్వహిస్తుంటుంది. 24న ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన కేంద్రాల్లో పరీక్ష నిర్వహణ ఉంటుంది. ఈ విషయమై హాల్ టికెట్లను సంబంధిత వెబ్‌సైట్లో ఉంచినట్లు వాటిని డౌన్‌లోడ్ చేసుకోవాలని ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకుడు ఇటీవల తెలియజేసిన విషయం తెలిసిందే. సుమారు ఐదు నెలల తదుపరి ఫలితాలు వెల్లడిస్తారు. పరీక్షలో అర్హత సాధించిన సదరు విద్యార్థి ఖాతాలో ప్రభుత్వం నాలుగేళ్ల పాటు రూ.12 వేల చొప్పున జమచేస్తుంది. తొమ్మిది, పది, ఇంటర్‌లో ప్రథమ, ద్వితీయ సంవత్సరం వరకు ప్రభుత్వ రంగ సంస్థల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు ఈ ఉపకారం అందనుంది. ముఖ్యంగా ఫలితాలు వెల్లడి ప్రక్రియలో ప్రతిసారి ఉమ్మడి జిల్లా నుంచి వందల సంఖ్యలో విద్యార్థులు ఎంపికై ఉపకారవేతనాలు అందుకుంటుండటం విశేషం. మరి కొద్దిరోజుల్లో నిర్వహించనున్న పరీక్షలో ఈసారి గతంకన్నా ఎక్కువ మంది విద్యార్థులు అర్హత సాధిస్తారని ఆశిద్దాం.


**విధానం ఇలా**

కేంద్ర విద్యాశాఖ ఏటా ఈ పరీక్షను దేశ వ్యాప్తంగా నిర్వహిస్తుంది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ అర్హత పరీక్ష రాయాల్సి ఉంటుంది. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎన్‌ఎంఎంఎస్ పరీక్షను రాసేందుకు ఉమ్మడి నల్గొండ జిల్లాలో వందల సంఖ్యలో విద్యార్థులు దరఖాస్తు చేశారు. ప్రధానంగా మెంటల్ ఎబిలిటీ 30 మార్కులు, మల్టీపుల్ ఛాయిస్ విధానంలో ప్రశ్నలుంటాయి. స్కాలస్టిక్ ఎబిలిటీ పరీక్ష 90 మార్కులు, 7వ, 8వ తరగతుల సైన్స్, గణితం, సాంఘిక శాస్త్ర పాఠ్యాంశాలకు సంబంధించి ప్రశ్నలుంటాయి. పరీక్షలో సాధించిన మెరిట్ ఆధారంగా ఉపకార వేతనానికి ఎంపిక ఉంటుంది. ముఖ్యంగా జిల్లా యూనిట్‌గా, కేటగిరీల వారీగా, ప్రతిభ కొలమానంగా అర్హులను ఎంపిక చేస్తారు.

ప్రణాళికతో సిద్ధం కావాలి - గొల్లెన తేజస్వినీ, దూదివెంకటాపురం

2023-24లో ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష రాసి ఆ పథకానికి ఎంపికై ఉపకార వేతనం పొందుతున్నాను. పరీక్ష రాసేవారు ఈ కొద్ది రోజుల్లోనూ ప్రణాళికతో సిద్ధం కావాలి. ముఖ్యంగా మెంటల్ ఎబిలిటీ పేపర్‌పై ఎక్కువ దృష్టి పెట్టాలి. గత ప్రశ్న పత్రాలను నిత్యం సాధన చేయాలి. సందేహాలను పాఠశాల సబ్జెక్టు ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకుంటే ప్రయోజనం ఉంటుంది.

# యోగా శిక్షకులు వచ్చేశారు..!




కోదాడ :ప్రజారోగ్యంపై దృష్టి సారించిన ఆయుష్ శాఖ పల్లెలతో పాటు పట్టణవాసులు యోగాతో ఆరోగ్యంగా జీవించేందుకు చర్యలు చేపట్టింది. ప్రభుత్వ ఆయుర్వేద, హోమియో, యునాని వైద్యశాలల్లో యోగాసనాలు సాధన చేయించేందుకు ప్రత్యేకంగా శిక్షకులను నియమించింది. ఉమ్మడి నల్గొండ జిల్లాలో 92 ఖాళీలు ఉండగా సెప్టెంబరు 27న నియామక ప్రక్రియ ప్రారంభించి ఇటీవల తాత్కాలిక పద్ధతి(కాంట్రాక్టు)పై అర్హులైన 56 మందికి వైద్యశాలలను కేటాయించారు. శిక్షకులు సంబంధిత ఆసుపత్రుల్లో ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు ఆరోగ్య సంబంధిత ఆసనాలను సాధన చేయిస్తారు. ప్రతి కేంద్రంలో మహిళా శిక్షకురాలు కూడా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. మహిళా ఇన్‌స్ట్రక్టర్లకు రూ.5 వేలు, పురుషులకు రూ.8 వేలు గౌరవ వేతనంగా చెల్లిస్తారు. మరో 36 మందిని రెండో విడతలో నియమిస్తామని ఆయుష్‌శాఖ సూర్యాపేట జిల్లా ఇన్‌ఛార్జి డాక్టర్ బి.రామకృష్ణ తెలిపారు. స్థానికులుఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# నిధులు రాక.. పనులు పూర్తికాక

రాయికల్ : దళారీ వ్యవస్థకు చరమగీతం పాడుతూ స్థానిక రైతులకు గిట్టుబాటు ధర లభించేలా.. వినియోగదారులకు నాణ్యమైన తాజా కూరగాయలు, మాంసం అందుబాటులో ఉండేలా అన్ని పురపాలికల్లో సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణాలకు 2021–22లో గత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల, ధర్మపురిలో స్థలాలు సేకరించి నిర్మాణాలు చేపట్టారు. రాయికల్ పట్టణంలో ప్రభుత్వ స్థలం అందుబాటులో లేక మార్కెట్ యార్డు స్థలంలో నిర్మాణానికి గుంతలు తీశారు. రైతుల నుంచి వ్యతిరేకత రావడంతో పూడ్చివేశారు. మిగిలిన నాలుగు బల్దియాల్లో పనులు చివరి దశకు వచ్చినా నిధులు లేక అసంపూర్తిగా ఉన్నాయి. పురపాలికల్లో సమీకృత మార్కెట్ స్థితిగతులపై కథనం..

**బిల్లులు రాలేదని..**

స్థానిక బీటులో రెండేళ్ల కిందట రూ.9 కోట్లతో సమీకృత మార్కెట్ నిర్మాణం చేపట్టారు. కూరగాయలు, పండ్లు, మాంసాహారం విక్రయాలకు అనువుగా మూడు భవనాలు నిర్మించారు. ఇప్పటి వరకు రూ.4 కోట్ల మేర పనులు పూర్తయ్యాయి. మరో రూ.5 కోట్ల మేర పనులు అపరిష్కృతంగా మిగిలిపోయాయి. గుత్తేదార్లకు బిల్లులు రాకపోవడంతో పనులు నిలిపివేశారు. సమీకృత మార్కెట్ సముదాయంలో ప్రహరీ, మౌలిక వసతుల కల్పనతోపాటు రవాణాకు అనుకూలంగా మార్పులు చేపట్టాల్సి ఉంది. ఈ నేపథ్యంలో వినియోగానికి అవసరమయ్యే విధంగానైనా సమీకృత మార్కెట్‌ను అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ రూ.25 లక్షలు బల్దియా సాధారణ నిధుల నుంచి మంజూరు చేయించారు. ఈ నిధులతో రహదారులు, తాగునీటి వసతి, మూత్రశాలలు, విద్యుత్తు తదితర సౌకర్యాలు సమకూర్చనున్నారు. దీనికి సంబంధించి పాలనాపరమైన ఆమోదం రావాల్సి ఉంది. పట్టణంలో ఇప్పటికే గడియారం పాతమార్కెట్, పాతబస్టాండు ఇందిరా మార్కెట్, రైతుబజార్‌లో కూరగాయల విక్రయాలు కొనసాగుతున్నాయి. చేపల మార్కెట్ కొత్తబస్టాండులో, మటన్ విక్రయాలు వ్యాపారుల ఇళ్లలోనే నిర్వహిస్తున్నారు.

**రంగులు వెలిసిపోతున్నాయి..**

కోరుట్ల పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు స్థలంలో 2021–22లో ఏకీకృత మార్కెట్ నిర్మాణం చేపట్టాలని పాలకులు నిర్ణయించారు. ప్రభుత్వం ప్రత్యేక జీవో నం.65 ద్వారా రూ.7.35 కోట్ల నిధులను కేటాయించారు. రెండన్నరేళ్ల కిందట గుత్తేదారు మార్కెట్ నిర్మాణ పనులు ప్రారంభించారు. రెండు భారీ షెడ్లలో కూరగాయలు, మాంసం, పూలు, పండ్లు, ఇతర సరకుల విక్రయాలకు మొత్తం 134 ప్లాట్‌ఫాంలను నిర్మించారు. విద్యుత్తు, నీటి పైపులైన్లు ఏర్పాటు చేశారు. ఎనిమిది నెలల కిందట రంగులు వేయించారు. ఇప్పటివరకు చేపట్టిన నిర్మాణానికి సంబంధించిన బిల్లుల చెల్లింపుల్లో జాప్యంతో గుత్తేదారు పనులను నిలిపివేశారు.

**స్థలం లేదని..**

రాయికల్‌లో రూ.10 లక్షలతో కూరగాయలతోపాటు మాంసం, చేపల విక్రయాలు జరిపేలా నూతన షెడ్లు నిర్మించారు. కొందరు కూరగాయలు, వీధి వ్యాపారులు ప్రధాన రహదార్లపైనే విక్రయాలు జరపడంతో మార్కెట్‌లోకి ప్రజలు వచ్చి కొనుగోళ్లు జరపడం లేదు. రాయికల్ పట్టణంలో సమీకృత మార్కెట్ నిర్మాణానికి



ప్రభుత్వం 2021లో రూ.3 కోట్లు మంజూరు చేసింది. ప్రభుత్వ స్థలం అందుబాటులో లేకపోవడంతో రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న వ్యవసాయ మార్కెట్ స్థలంలో నిర్మాణానికి గుంతలు తీశారు. మార్కెట్ యార్డులో ధాన్యం నిల్వకు స్థలం కొరత ఏర్పడుతుందని రైతుల నుంచి తీవ్రమైన వ్యతిరేకత రావడంతో తవ్విన గుంతలు పూడ్చివేశారు.

**గద్దెలు అనుకూలంగా లేవని**

ధర్మపురి పట్టణంలో గత ప్రభుత్వం రూ.8 కోట్ల వ్యయంతో ఆధునిక సదుపాయాలతో సమీకృత వెజ్, నాన్ వెజ్‌మార్కెట్లు నిర్మించారు. నాలుగు షెడ్లలో ఒక్కొక్క షెడ్డులో 50 ప్లాట్‌ఫాంలను నిర్మించారు. సమీకృత మార్కెట్‌ను గత ప్రభుత్వ హయాంలోనే ప్రారంభించారు. లోపల గద్దెలు సౌకర్యంగా లేవని, తాము షెడ్ల లోపల కూరగాయలను విక్రయించలేమని తేల్చిచెప్పి వ్యాపారులు, రైతులు షెడ్ల బయటనే సుమారు ఏడాది నుంచి విక్రయాలు సాగిస్తున్నారు. లోపల ఉన్న గద్దెలను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ ప్రక్రియ పెండింగులోనే ఉండిపోయింది. ఆరుబయట విక్రయించే రైతులు, వినియోగదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మరో రూ.2 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంది. ప్రహరీ, తాగునీటి వసతులు, ఇతరత్రా సదుపాయాలు కల్పించి వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

**వాహనాల పార్కింగ్..**

సమీకృత మార్కెట్ నిర్మాణ పనులను 2021లో అప్పటి పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. మొదట సుమారు రూ.6.35 కోట్లు నిర్ణయించి తర్వాత కేవలం రూ.4.50 కోట్లు మాత్రమే కేటాయించడంతో వెజ్, నాన్‌వెజ్ సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు చేపట్టారు. రెండు బ్లాక్‌లలో 122 ప్లాట్‌ఫాంలు నిర్మించారు. వీటితో పాటు నాన్‌వెజ్ మార్కెట్‌కు 16 ప్లాట్‌ఫాంలు నిర్మించారు. ప్రస్తుతం 60 శాతం పనులు పూర్తికాగా చేపట్టిన నిర్మాణాలకు బిల్లులు రాక గుత్తేదారు మధ్యలోనే నిలిపివేశారు. మార్కెట్ నిర్మాణ పనులు నిలిచిపోవడంతో రోడ్లపై విక్రయాలు సాగిస్తున్నారు. ప్రస్తుతం నూతనంగా నిర్మిస్తున్న మార్కెట్ భవనాల్లో పిచ్చిమొక్కలు పెరిగి చెత్తాచెదారంతో అధ్వానంగా మారాయి. వాహనాల పార్కింగ్, మరికొందరు ఇసుక, కంకర విక్రయాలు సాగిస్తుండగా, నాన్‌వెజ్ మార్కెట్ మాత్రం భిక్షాటకులకు నిలయంగా మారింది.

# బాలికల భద్రతకు భరోసా

గజ్వేల్ : బాలికల భద్రతకు భరోసా కల్పించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. వేధింపులు, లైంగిక దాడులు, జీవన నైపుణ్యాలు, లింగ సమానత్వం.. ఇతర సమస్యలను ధైర్యంగా ఎదుర్కొనేలా అవగాహన కల్పిస్తూ బాలికల్లో ధైర్యం నింపేలా కార్యక్రమాలను నిర్వహించేందుకు ప్రత్యేకంగా ఇటీవల జిల్లాలో 100 పాఠశాలల్లో బాలికా సాధికారత క్లబ్‌లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. విద్య, పోలీసు శాఖల సమన్వయంతో పాఠశాల స్థాయి బాలికలకు భద్రత కల్పించాలనే ఉద్దేశంతో రూపొందించిన కార్యక్రమమే బాలిక సాధికారత క్లబ్‌లు ఏర్పాటయ్యాయి. జిల్లాలోని 62 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 38 కస్తూర్బా, ఆదర్శ గురుకులాల్లో క్లబ్‌లను ఏర్పాటు చేశారు. వీటిని ప్రతినెల జిల్లా కలెక్టర్ సమీక్షిస్తుంటారు.

**నెలవారీ సమావేశాల్లో చర్చ**

మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖల సౌజన్యంతో పిల్లల్లో పౌష్టికాహార సమస్యలు, వ్యక్తిగత పరిశుభ్రత, జీవన నైపుణ్యాలపై ప్రతినెల సమావేశంలో చర్చించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తారు. లింగ సమానత్వం, మంచి స్పర్శ, అసభ్యకర స్పర్శ (గుడ్ టచ్, బాడ్ టచ్)ల గురించి, బాలికల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, లైంగిక దాడులు, బాల్య వివాహాల అంశాలపై 'ఫ్రెండ్లీ టీచర్' కార్యక్రమం ద్వారా విద్యార్థినులు తెలుసుకుంటారు.

**ధైర్యం పెంచడానికి సంఘాలు**

బాలికల రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. వారి భద్రత కోసమే బాలికల సాధికారత సంఘాలు ఏర్పాటు చేశారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో పాఠశాలల్లో చదువుకునే అవకాశం ఉంటుంది. హెల్ప్ లైన్ నెంబర్లు 1098, 100, 181 కు ఫిర్యాదు చేస్తే తక్షణమే చర్యలు తీసుకుంటున్నారు. అందరి ముందు చెప్పలేని సమస్యలను ఫిర్యాదు పెట్టెలో ఉత్తరాలు రాసి వేసేలా ప్రోత్సహిస్తారు. ప్రతి శుక్రవారం ఫిర్యాదుల పెట్టెను కమిటీ సభ్యుల సమక్షంలో తెరుస్తారు. విద్యార్థినుల తీవ్రమైన సమస్యలకు జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులు పరిష్కరిస్తారు.

# ఆదమరిస్తే ప్రమాదం.. అప్రమత్తతే ప్రధానం



వికారాబాద్ : హైదరాబాద్ నుంచి వికారాబాద్ జిల్లా కేంద్ర పరిసరాల్లోకి రాగానే చల్లటి గాలులతో శివసాగర్ చెరువు స్వాగతం పలుకుతుంది. దీనిని ఆనుకుని 2. కి.మీ. మేర ఉన్న రోడ్డుపై వెళుంటే ఈ గాలులు తాకుతూ ఎంతో హాయిగా ఉంటుంది. కానీ అదే రోడ్డు, అదే చెరువు పొగమంచుతో తెల్లవారుజామున, చీకటితో రాత్రివేళ మృత్యుదారిగా మారి ప్రాణాలకే ముప్పు తెస్తోంది. హైదరాబాద్‌నుంచి తాండూరు, పుణే వైపు వెళ్లే ఈ ఏవాహనమైనా ఈ రోడ్డు మీదుగా వెళ్లాల్సిందే. ఆదమరిస్తే ప్రమాదం బారిన పడక తప్పదం లేదు.

**ఇలా చేయాలి**

ఇరుపైపుల పెరిగిన పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలను తొలగించడం.
రోడ్డుకు ఇరువైపులా సమాంతరంగా మొరం వేయడం.
రోడ్డు ఇరుకుగా ఉందని, పక్కన చెరువు ఉందని సంకేతాలతో కూడిన సూచిక బోర్డులు ఏర్పాటు చేయడం

**కొన్ని ఉదాహరణలు**

2023 డిసెంబరులో ఉదయం రాజధాని నగరం నుంచి అనంతగిరి అందాలను తిలకించడానికి ఐదుగురు స్నేహితులు విహారయాత్రకు రాగా పొగ మంచు ప్రభావంతో రోడ్డు కనిపించలేదు. దీంతో కారు శివసాగర్ ప్రాజెక్టులోకి దూసుకెళ్లి నలుగురు స్వల్ప గాయాలతో బయటపడగా, ఒకరు మృతి చెందారు.

2022 నవంబరులో శివసాగర్ ప్రాజెక్టు రోడ్డుపై సాంకేతిక లోపంతో లారీని నిలిపి ఉంచారు. దీన్ని గుర్తించక అర్ధరాత్రి ద్విచక్ర వాహనం వెనుక నుంచి ఢీ కొని ఇద్దరు యువకుల మృతి.

తాజాగా 5 రోజుల కిందట శివసాగర్ ప్రాజెక్టులోకి స్కూటీతో దూసుకెళ్లిన కుషాయిగూడకు చెందిన విక్రమ్ (24) 16వ తేదీ రాత్రి శవమై తేలాడు. మృతదేహం నీటిపై తేలితే గానీ సమాచారం తెలియలేదు.

ఇవీ ప్రధాన కారణాలు..

రోడ్డు వారగా చెరువు ఉన్న విషయమే తెలియక పోవడం.
రోడ్డు ఇరుకుగా ఉండటం.
విస్తరణకు వీలుకాని స్థితి.
లోతు కనిపించనంతుగా ఇరువైపులా పెరిగిన ముళ్లపొదలు.
కొత్త వారికి రహదారులపై మలుపులు, గుంతలు తెలియక పోవడం.
పెద్ద వాహనం ఎదురుగా వస్తే తప్పనిసరిగా చెరువులోకి వాహనం వెళ్లడం.

**ఇటీవలే సమీక్షించాం- నారాయణరెడ్డి, జిల్లా పోలీసు అధికారి**

జిల్లాలో తరచూ ప్రమాదాలు జరిగే 45 ప్రాంతాలను గుర్తించాం. ఇందులో శివారెడ్డిపేట చెరువు ప్రాంతం ఒకటి. ఈ ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు అవసరమైన ముందస్తు జాగ్రత్తలు, చర్యలపై ఆర్అండ్‌బీ అధికారులతో ఇటీవలే సమీక్షించాం.

# ఆర్ఎంసీలతో శబ్ద, వాయు కాలుష్యం



హైదరాబాద్: శివార్లలో పెద్ద సంఖ్యలో ఆర్ఎంసీ (రెడీమిక్స్ కాంక్రీట్) యూనిట్లు ఏర్పాటవుతున్నాయి. కొన్ని సంస్థలు కాలుష్య నియంత్రణ మండలి అనుమతి తీసుకుంటుండగా అనేకం అనుమతి లేకుండానే కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ఫలితంగా కోకాపేట్, శేరిలింగంపల్లి, మణికొండ ప్రాంతాలవాసులు దుమ్ము, ధూళితో అవస్థలు పడుతున్నారు. క్లోజ్డ్ షెడ్, హెచ్‌డీపీఈ డస్ట్ సౌండ్ బారియర్స్‌ను ఏర్పాటు చేస్తే శబ్ద, వాయు కాలుష్యాన్ని నియంత్రించవచ్చని నిపుణులు సూచిస్తున్నా నిర్వాహకులు పెడచెవిన పెడుతున్నారు.

**కోకాపేటలో తీవ్రం..** కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి లెక్కల ప్రకారం కోకాపేట వాయునాణ్యతా నమోదు కేంద్రంలో 15 రోజులుగా నాణ్యత క్రమంగా తగ్గుతోంది. పీఎం 10 ధూళి కణాల స్థాయి అధికంగా విడుదలవ్వడమే ఇందుకు కారణం. నిర్మాణ రంగంలో కార్యకలాపాలు, ఆర్ఎంసీ యూనిట్ల నుంచి వెలువడే దుమ్ము కణాలతోనే వీటి సూచీ పెరుగుతుందని పీసీబీ అధికారులు వెల్లడించారు. 15రోజుల్లో కేవలం నాలుగు రోజుల్లో వాయునాణ్యత సూచీ 100లోపే నమోదు కాగా మిగిలిన రోజుల్లో 105నుంచి 153 మధ్య నమోదైంది. కోకాపేటతో పాటు పక్కల వందల సంఖ్యలో నిర్మాణ కార్యకలాపాలు సాగుతుండగా అనేక ఆర్ఎంసీ ప్లాంట్లను ఏర్పాటు చేశారు.

కుత్బుల్లాపూర్ పరిధిలోని బౌరంపేట, సారిగూడెం ప్రాంతాల్లో అనుమతి లేకుండా అనేక ఆర్ఎంసీ ప్లాంట్లు వెలిశాయి. చుట్టుపక్కల ప్రాంతాల్లో సుమారు 20 ఆర్ఎంపీ ప్లాంట్లు ఉన్నట్లు అంచనా. వాస్తవానికి దుమ్ము రేగకుండా స్ప్రింక్లర్ల ద్వారా నీళ్లు వెదజల్లుతూ ఉండాలి. రాత్రిపూటే వాహనాల రాకపోకలకు అనుమతించాలి. నిర్మాణ ప్రదేశాల్లో వస్తువులను కిందకి పంపడానికి హెచ్‌డీపీఈ డస్ట్ సౌండ్ బారియర్స్‌ను మాత్రమే వాడాలి. క్లోజ్డ్ షెడ్‌లో ఆర్ఎంసీని ఏర్పాటు చేయడం ద్వారా దుమ్ము గాలిలో కలిసే అవకాశం ఉండదు.

**పీసీబీ మూసివేత ఆదేశాలు** కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టని నిర్మాణ సంస్థలపై పీసీబీ ఇటీవల మూసివేత ఆదేశాలు జారీచేసింది. జూబ్లీహిల్స్‌లోని డీఎస్ఆర్ఎస్ఆర్, కూకట్‌పల్లిలోని వైట్ వాటర్స్ కన్‌స్ట్రక్షన్స్ కార్యకలాపాలు నిలిపివేయాలని ఆదేశించింది. శేరిలింగంపల్లిలోని వాసవి హోమ్స్‌లో ఏర్పాటు చేసిన రెడీమిక్స్ కాంక్రీట్ ద్వారా కాలుష్య ఉద్గారాలు వెలువడుతుండటంతో మూసివేత ఆదేశాలిచ్చింది.

# నిఘా కొరవడి.. కల్తీకి తెగబడి

హైదరాబాద్ : మూసేసిన, ఖాయిలా పడిన పరిశ్రమలపై అధికారుల నిఘా కొరవడటంతో అక్రమ కార్యకలాపాలకు అడ్డాలుగా మారాయి. రసాయన డ్రమ్ములను భద్రపరిచే గోదాములుగా, కల్తీ ఉత్పత్తులు తయారు చేసే కారా?నాలుగా తయారయ్యాయి.

**ఇదీ పరిస్థితి..** రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 9,500 రెడ్, ఆరెంజ్, గ్రీన్ కేటగిరీ పరిశ్రమలు ఉండగా, ఇందులో 5వేల వరకు గ్రేటర్ పరిధిలో ఉన్నాయి. కాలుష్య నియంత్రణ మండలి, పరిశ్రమలశాఖ నిబంధనలు పాటించని వాటిపై చర్యలకు ఉపక్రమించిన అధికారులు.. మూసివేతకు ఆదేశాలిస్తూ, విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నారు. అనంతరం నిఘా లేకపోవడంతో అక్రమార్కులు వాటిని అడ్డాలుగా మార్చుకుంటున్నారు. టీపొడి, నెయ్యి, నూనె, మిరియాలు, అల్లం పేస్ట్, ఐస్‌క్రీమ్, చాక్లెట్ల కల్తీ ఉత్పత్తుల తయారీకి కేంద్రాలుగా చేసుకుంటున్నారు. బయట తాళం ఉంటుంది.. లోపల కార్యకలాపాలు సాగుతుంటాయి. ప్రధానంగా జీడిమెట్ల, నాచారం, కాటేదాన్ ప్రాంతాల్లో ఈ తరహా ఘటనలు పునరావృతం అవుతున్నాయి. మూసేసిన పరిశ్రమల నుంచి రాత్రుళ్లు ఘాటు వాసనలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయంటూ పీసీబీ గస్తీ బృందానికి ఫిర్యాదులు అందుతున్నాయి.

**ఆరు నెలల్లో 20 ఘటనలు..**

జీడిమెట్లలో మూతబడిన పరిశ్రమలు.. రసాయనాలను నిల్వ చేసే గోదాములుగా మారుతున్నాయి. డ్రమ్ముల్లో నింపిన రసాయనాలను ఆరు బయటే ఉంచడంతో అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయి. గత ఆరు నెలల్లో జీడిమెట్ల పారిశ్రామికవాడలో 100 అగ్నిప్రమాదాలు సంభవిస్తే, 20 ఘటనలు ఇలాంటి గోదాముల్లోనే సంభవిస్తున్నాయి. ఫ్యాక్టరీస్ చట్టానికి తూట్లు పొడుస్తూ, కార్మికుల, స్థానికుల భద్రతను విస్మరిస్తూ నిర్వాహకులు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు.

**పునరుద్ధరణ చేపట్టగా ప్రమాదం..**



జీడిమెట్ల పారిశ్రామికవాడలో సాబూరి ఫార్మా కంపెనీ కొన్ని నెలలుగా మూసివేసి ఉంది. పరిశ్రమను పునరుద్ధరించాలని యాజమాన్యం పనులు మొదలుపెట్టింది. ఈ క్రమంలోనే కార్మికులు రాము (32), లక్ష్మణ్(32) ఫ్యాబ్రికేషన్ పనుల్లో చేశారు. కెమికల్ సంపులు శుభ్రం చేస్తుండగా ఇద్దరు ప్రమాదవశాత్తు అందులో పడి ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో వెంకట్రామిరెడ్డి అనే వ్యక్తి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటనతో పారిశ్రామికవాడలో కార్మికులు, సిబ్బంది రక్షణ, భద్రతకు తీసుకుంటున్న చర్యలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జీడిమెట్ల, కాటేదాన్ పారిశ్రామికవాడల్లో ఇలాంటి ఘటనలు అనేకం జరుగుతున్నాయి. బీహార్, యూపీ నుంచి వచ్చే కార్మికులు మూసేసిన, పునరుద్ధరించే పరిశ్రమల్లో పనిచేస్తూ ప్రాణాలు కోల్పోతున్నారు. మృతుల కుటుంబాలకు నిర్వాహకులు ఎంతో కొంత ముట్టజెప్పి, మృతదేహాలను రాష్ట్రం దాటించేసి చేతులు దులుపుకుంటున్నారు.

# శీతాకాలం.. వ్యాధుల భయం

గోదావరిఖని : శీతాకాలం వచ్చిందంటే చాలు వ్యాధుల ముప్పు పొంచి ఉంటుంది. వాతావరణంలో మార్పులు, చలి తీవ్రత కారణంగా ఎక్కువ ఆరోగ్య సమస్యలు తలెత్తుతుంటాయి. చలి తీవ్రత ఎక్కువగా ఉంటే శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తుతాయి. ఊపిరితిత్తుల్లో సమస్యలు తలెత్తి న్యుమోనియా వ్యాపించే అవకాశం ఉంటుంది. ఆస్పత్రుల్లో ఇప్పటికే జ్వర బాధితులు పెరుగుతున్నారు. ఈ సీజన్‌లో జలుబు, దగ్గు, అస్తమా, ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్లు, గుండె సంబంధ సమస్యలు, కీళ్ల నొప్పులు, శరీరంలోని అన్ని అవయవాలకు రక్త ప్రసరణ తగ్గడం వంటి ఇబ్బందులు తలెత్తుతాయి. చలి ప్రభావం పిల్లలు, వృద్ధులపై అధికంగా ఉంటుంది. వీరి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు

**పెరుగుతున్న రోగులు**

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు ప్రైవేటు ఆస్పత్రుల్లో రోగుల సంఖ్య పెరుగుతోంది. చలితీవ్రత పెరుగుతుండటంతో జ్వరం, జలుబు, దగ్గుతో పాటు శ్వాసకోశ సమస్యలతో వైద్యుల వద్దకు రోగులు క్యూ కడుతున్నారు. ఒక్క గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రిలో అక్టోబరు



నెలలో 24,022 మంది వివిధ రకాల చికిత్స కోసం రాగా, కేవలం ఈనెలలో ఇప్పటి వరకే 10,003 మంది వైద్యం చేయించుకున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

రోగ నిరోధక శక్తి పెంపునకు
వ్యాయామం, నడక తప్పనిసరి.
గోరువెచ్చని నీటిని తాగాలి.
ఆవిరి పడుతూ శ్వాస నాళాలను శుభ్రం చేసుకోవాలి.
విటమిన్–సి తో కూడిన పండ్లు, ఇతర ఆహార పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి.
పాలు, పప్పులు, కూరగాయల వినియోగం పెంచాలి
వృద్ధులు ఎక్కువగా విశ్రాంతి తీసుకోవాలి. తగినంత నిద్రపోవాలి
చిన్న పిల్లలు, వృద్ధులు ఉన్ని దుస్తులు ధరించేలా చూడాలి
మాస్కులు ధరిస్తే మేలు. చేతులను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలి. చల్లటి వాతావరణంలో పిల్లలు, వృద్ధులు తిరగకుండా చూసుకోవాలి.

చలిలో తిరగనివ్వొద్దు

చలికాలంలో పిల్లల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి. చలి ప్రదేశంలో ఎక్కువగా తిరగనివ్వకూడదు. శ్వాస సంబంధ సమస్యలు ఎక్కువగా వస్తాయి. జలుబు, తీవ్ర జ్వరంతో పాటు ఆయాసం ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. కుటుంబంలో అస్తమా సమస్యలు ఉన్న వారు ఉంటే ఇంట్లో పిల్లలకు సైతం సంక్రమించే అవకాశం ఉంటుంది. చాక్లెట్లు, ఐస్‌క్రీం, చల్లని పానీయాలకు పిల్లలను దూరంగా ఉంచాలి. డా. ఆదీష్‌రెడ్డి, పిల్లల వైద్య నిపుణులు, ఖని ప్రభుత్వ ఆసుపత్రి

**మాస్కులు ధరించాలి**

చల్లటి గాలి ముక్కులోకి వెళ్లకుండా మాస్కులు ధరించాలి. దీని వల్ల చలి తీవ్రతను కొంత వరకు అదుపు చేసుకునే అవకాశం ఉంటుంది. సాధారణ సమయంలో జలుబు, దగ్గు, జ్వరం లాంటి వాటితో ప్రమాదం లేదు. చలికాలంలో ఈ సమస్యలు వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. వృద్ధుల విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. డా. అశోక్, జనరల్ ఫిజీషియన్.

# న్యాక్‌లో మెరిసినా నిధులకు ఎదురుచూపులే!

సంగారెడ్డి : ఇంటర్ పూర్తి కాగానే ఎక్కువ మంది విద్యార్థులు డిగ్రీలో చేరుతుంటారు. కళాశాల ఆవరణ ఆహ్లాదంగా ఉండటంతో పాటు కనీస వసతులు కల్పిస్తేనే మెరుగైన ఫలితాలు సాధించేందుకు వీలుంటుంది. ఇవన్నీ సదుపాయాలు ఉన్నాయా లేవా అని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) ఆధ్వర్యంలోని న్యాక్(నేషనల్ అక్రిడేషన్ అసెస్‌మెంట్ కౌన్సిల్) పరిశీలిస్తుంది. ఈ క్రమంలోనే సంగారెడ్డి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో న్యాక్ బృందం పరిశీలించి మెరుగైన గ్రేడింగ్ ఇచ్చింది. ఇది జరిగి ఏడాదైనా నిధుల కేటాయింపు లేకపోవడం గమనార్హం.

**సమష్టిగా ముందుకు సాగడంతో..**

జిల్లాలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల సంగారెడ్డిలోనే ఉంది. ఇక్కడ 380 మంది విద్యార్థినులు చదువుతున్నారు. బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. తెలుగు, ఆంగ్లం, ఉర్దూ మాధ్యమంలోనూ కోర్సులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ సమస్యలు అధికం కావడంతో ప్రిన్సిపల్ సహా అధ్యాపకులు సమష్టిగా ముందుకు సాగి పనిచేశారు. న్యాక్ బృందం పర్యటన సమయంలో కాలేజీ ఆవరణను ఆహ్లాదంగా మార్చారు. రంగులతో కొత్త కళ తీసుకొచ్చారు. కనీస



వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇచ్చారు. దీంతో న్యాక్ బృందం సంతృప్తి చెందింది. గతంలో బి గ్రేడ్ ఉండగా బీ ప్లస్‌ప్లస్ గ్రేడింగ్ ఇచ్చింది. గతంలో 2.1 సీజీపీఏ సాధించగా ఇప్పుడు 2.88కు చేరడం విశేషం.

**డబ్బులు వస్తేనే ప్రగతికి బాటలు**

కళాశాలకు మంచి గ్రేడ్, సీజీపీఏ రావడంతో యూజీసీ నుంచి రావలసిన నిధులు మరింత పెరగాల్సి ఉంది. నిధులు కేటాయిస్తేనే అభివృద్ధికి బాటలు పడే అవకాశం ఉంటుంది. విద్యార్థినులకు కనీస వసతులు సమకూరుతాయి.

**మరమ్మతులకు రూ.15 లక్షలు అవసరం**

సమష్టి కృషి వల్లే న్యాక్‌లో గతం కంటే మెరుగైన గ్రేడ్ సాధ్యమైంది. రూసా పథకం కింద త్వరలో నిధులు విడుదలయ్యే అవకాశం ఉంది. గతంలో బీ గ్రేడ్ మాత్రమే ఉండటంతో నిధులు కేటాయించలేదు. ఇప్పుడు బీ ప్లస్‌ప్లస్ రావడంతో నిధులకు అర్హత సాధించాం. ఆ డబ్బులు వస్తేనే అభివృద్ధికి మార్గం సుగమం అవుతుంది. ప్రస్తుతం వివిధ మరమ్మతులకు రూ.15 లక్షల అవసరం ఉంది. అరుణ, కళాశాల ప్రిన్సిపల్.

## చెత్తవేస్తే పక్కాగా చిక్కేస్తారు

హైదరాబాద్: రాత్రవగానే రోడ్డుపక్కన చెత్త కుప్పలుగా పడుతుంది. చూసేవారు, అడిగేవారు ఉండరనే కారణంతో.. ఇళ్లు, హోటళ్లలోని వ్యర్థాలను రోడ్లపై పడేస్తున్నారు. అలాంటి వారిని క్షణాల్లో గుర్తించే నిఘా వ్యవస్థను ఉప్పల్ సర్కిల్ కార్యాలయం అందుబాటులోకి తీసుకొచ్చింది. గతంలో మాదిరి కాకుండా ఉపకమిషనర్ జి.ఆంజనేయులు పక్కాగా అమలు చేస్తున్నారు. మనిషి లేదా యంత్రం కదలికలను గుర్తించి, ఆ దృశ్యాలను ప్రత్యేక ఫోల్డర్‌లో భద్రపరిచే సెన్సర్లను సీసీ కెమెరాలకు అమర్చారు. దాంతో చెత్తకుప్పలు పడిన సమయం ఆధారంగా ఉల్లంఘునులను గుర్తించగలుగుతున్నారు. జరిమానా వేయడంతోపాటు కారణాలు విశ్లేషించి సమస్య పరిష్కారానికి చొరవ తీసుకుంటున్నారు. ఈ విధానాన్ని నగరవ్యాప్తంగా అమలు చేయడంపై బల్దియా దృష్టిపెట్టింది.

మార్పు తీసుకొస్తున్నాం.. ఉప్పల్ సర్కిల్‌లో దాదాపు 100కుపైగా



చెత్తకుప్పలున్నాయి. వాటిని సున్నా చేయడమే లక్ష్యంగా మూణ్నెళ్ల క్రితం 23 సీసీ కెమెరాలను అమర్చారు. కేవలం వీడియో రికార్డే కాకుండా మనిషి, వాహనం కదలికలు గుర్తించే కెమెరాలు అమర్చారు. ఎవరైనా చెత్త వేయడానికి వెళ్తుంటే వెంటనే వీడియో రికార్డింగ్ మొదలవుతుంది. ఆయా వీడియోలను ఆ ప్రాంతం పర్యవేక్షకులు, బాధ్యులైన అధికారికి పంపిస్తారు. చెత్త వేసిన వ్యక్తిని తెలుసుకుని, వారింటికి సిబ్బందితోపాటు స్వచ్ఛ ఆటో డ్రైవరును తీసుకెళ్లి.. లోపాలను అక్కడికక్కడే సరిదిద్దుతున్నట్టు ఉపకమిషనర్ 'ఈనాడు'కు తెలిపారు.

రూ.1,20,000 వసూలు..

ఇంట్లోని చెత్తను వీధిలో పడేస్తోన్న 310మందిని గుర్తించామని, వారికి రూ.500, రూ.1000 చొప్పున రూ.1,20,000 వరకు జరిమానా విధించామని అధికారులు తెలిపారు.జరిమానా వేయడమేగాక.. అందుకు కారణమవుతోన్న సిబ్బంది, స్వచ్ఛ ఆటోలపైనా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందరూ కలిసి పనిచేస్తేనే హైదరాబాద్ పరిశుభ్రంగా ఉంటుందని డీసీ వివరించారు.

## మూసీ 'దారి'కొచ్చేది ఎప్పుడు..!

నకిరేకల్: మూసీ.. గత రెండుమూడేళ్ల నుంచి నాగార్జునసాగర్ కంటే ముందుగానే నిండుతుంది.. పదేళ్ల నుంచి మండువేసవిలో నిండు కుండలా కనువిందు చేస్తోంది. 65వ నెంబర్ హైదరాబాద్–విజయవాడ, 365 నకిరేకల్– తానంచర్ల జాతీయ రహదారుల మధ్యలో ఉన్న జలాశయం ఇది. ఇన్ని ప్రత్యేకతలు ఉన్న మూసీ ప్రాజెక్టు వద్దకు వెళ్లేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. నకిరేకల్ సమీపంలో మూసీ నదిపై ఈ ప్రాజెక్టును నిర్మించి ఆరుదశాబ్దాలైనా నేటికి సరైన రోడ్డు సదుపాయం లేదు. మూసీ ప్రాజెక్టు వద్దకు చేరుకునేందుకు నకిరేకల్ నుంచే ప్రధాన రహదారి సౌకర్యం ఉంది. ఇది ఒక్క వరుసతోనే ఉండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నకిరేకల్ నుంచి మూసీ ప్రాజెక్టు 12 కిలోమీటర్లు. ఇరుకు రహదారిపై తరచు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆటోలు, ట్రాక్టర్లు అధికంగా బోల్తా పడుతున్నాయి. ద్విచక్రవాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి.



దీనిని రెండు వరుసలుగా విస్తరించాలని పదేళ్ల నుంచి స్థానికులు కోరుతున్నారు.ప్రాజెక్టు వద్దకు వచ్చే పర్యాటకులతో పాటు ఈ రోడ్డుపై నకిరేకల్, తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాలకు చెందిన 20 గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ప్రాజెక్టు, గేట్ల మరమ్మతులకు అవసరమైన భారీ క్రేన్లు, ఇతర వాహనాలు ఇక్కడి నుంచే వెళ్లాల్సి ఉంటుంది. ఇంత కీలకమైన రహదారి విస్తరణలో దశాబ్దాల తరబడి నిర్లక్ష్యం కొనసాగుతోంది. ఈ రహదారి పలు చోట్ల ధ్వంసమై గోతుల మయంగా మారి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆరేళ్ల క్రితం రూ.10 కోట్లతో దీని విస్తరణకు ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు కాలేదు. ఇటీవల మళ్లీ ప్రతిపాదనలు పంపి నెలలు గడుస్తున్నా మూసీ రహదారికి నిధుల ఊసే లేదు.

రూ. 30 కోట్లతో ప్రతిపాదనలు నకిరేకల్– మూసీ ప్రాజెక్టు రహదారి విస్తరణ కోసం రూ.30 కోట్లతో ఐదు నెలల క్రితం ప్రతిపాదనలు పంపించామని ఆర్అండ్‌బీ నకిరేకల్ ఏఈ సంతోశ్‌కుమార్ తెలిపారు. నకిరేకల్ ప్రధాన కూడలి నుంచి నోముల గ్రామం వైపు మూడ కిలోమీటర్ల మేర ఈ రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించేందుకు కూడా ఇదే ప్యాకేజీలో ప్రతిపాదించామన్నారు.

## బోరు నడవకపోతే పంట బేర్

గజ్వేల్: వాతావరణ పరిస్థితులకు వరి పంట ఉక్కిరిబిక్కిరి అవుతోంది. వర్షాకాలం సీజన్ దసరా పండుగతో దాదాపు ముగిసిపోనుందని వాతావరణ శాఖ విభాగం ఇప్పటికే ప్రకటించింది. ప్రస్తుతం అక్కడక్కడా అడపాదడపా వానలే కానీ నిరంతరంగా భారీగా కురుస్తున్న దాఖలాలు జిల్లాలో కానరావటం లేదు. మరోవైపు వానకాలం సీజన్‌లో రికార్డు స్థాయిలో 3.68 లక్షల ఎకరాల్లో సాగైన వరి పంట గట్టెక్కేందుకు రైతులు బోరు బావులపై ఎక్కువగా ఆధారపడుతున్నారు. దీనికి కరెంటు వినియోగం విపరీతంగా పెరుగుతోంది. గతేడాది ఇదే సీజన్‌తో పోల్చితే వ్యవసాయానికి విద్యుత్తు వినియోగం సగటున రోజుకు 8 మిలియన్ యూనిట్లు ఉండగా ప్రస్తుతం 9 మిలియన్ యూనిట్లు.. అంటే ఒక మిలియన్ యూనిట్లు ఎక్కువగా వాడుతున్నారని గణాంకాలు చెబుతున్నాయి.అప్పుడు ఆలస్యంతో ఇప్పుడు పొడిగింపు జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరగనున్నాయి. సీజన్ ప్రారంభంలో ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు, వర్షాల ఆలంబనతో కర్షకులు ఎక్కువగా వరి సాగు వైపు మొగ్గు చూపారు. సాధారణంగా వానాకాలం సీజన్‌లో వరి నాట్లు పంద్రాగస్టు వరకు పూర్తయితే నవంబర్ చివరి వారంలో నూర్పిళ్లకొస్తాయి. జిల్లా వ్యాప్తంగా వర్షాలు సకాలంలో కురియకపోవటంతో సెప్టెంబరులోనూ నాట్లు వేయాల్సి వచ్చింది. ప్రస్తుతం కొన్ని చోట్ల వరి పంట గొలుసుకట్టు దశలో ఉంది మరికొన్ని చోట్ల కరకు దశలో ఉన్నాయి.

# విద్యార్థులకు పౌష్టికాహారమే లక్ష్యం



కొడంగల్ : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పిల్లల్లో ఎక్కువ మంది పౌష్టికాహార లోపంతో బాధ పడుతున్నారు. ఈ విషయాన్ని పలు సర్వేలు వెల్లడించాయి. పేదరికం కారణంగా ఇంట్లో సరైన ఆహారం లభించక అనేకమంది పాఠశాలల్లో లభించే మధ్యాహ్న భోజనంపైనే ఆధారపడుతున్నారని అధికారులు గుర్తించారు. అలాంటి వారికి బలవర్థకమైన పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో 'అక్షయ పాత్ర' పేరుతో ప్రభుత్వం కొత్త పథకం ప్రారంభించింది. ఇందుకోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 'హరేరామ హరే కృష్ణ ఫౌండేషన్' ఆధ్వర్యంలో అల్పాహారం, భోజనం అందించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు.

పైలెట్ ప్రాజెక్టుగా కొడంగల్ నియోజకవర్గం

పథకం అమలుకు సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్‌ను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికచేశారు. నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుకొనే విద్యార్థులందరికీ అల్పాహారం, భోజనం అందిస్తారు. ఇందుకోసం కొడంగల్ పట్టణంలోని వృథాగా ఉన్న సమీకృత మార్కెట్ యార్డులో ఫౌండేషన్ వారు రూ.4 కోట్లతో బాహుబలి కిచెన్ షెడ్డు నిర్మిస్తున్నారు. ఫౌండేషన్ నుంచి రూ.2 కోట్లు, సీఎస్ఆర్ ఫౌండేషన్ నుంచి రూ.2 కోట్లు కేటాయించారు. పనులు అక్టోబర్ చివరి నాటికి పూర్తి చేస్తారు. ఇప్పటికే కొన్ని అక్షయ పాత్ర వస్తువులు చేరుకొన్నాయి. పైపులైన్ల ఏర్పాటు, గ్రానైట్ పనులు ముగింపు దశలో ఉన్నాయి. భవనానికి ఆరు బయట రంగులు వేస్తున్నారు. 28వేల మందికిపైగా విద్యార్థులకు లబ్ధి నియోజకవర్గంలోని వికారాబాద్ జిల్లాకు సంబంధించి కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట, దుద్యాల మండలాలు, నారాయణపేట జిల్లాకు సంబంధించి కోస్గి, మద్దూరు, గుండుమాల్, కొత్తపల్లి మండలాల్లో ఈ పథకం అమలవుతుంది. మొత్తం 312 ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు గల 28,000కు పైగా గల విద్యార్థులకు లబ్ధి చేకూరుతుంది.

అల్పాహారం, భోజనం అందిస్తాం

హరేరామ హరే కృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అక్షయ పాత్ర ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొంటున్న విద్యార్థులకు బలవర్థకమైన అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందిస్తారు. తొలి దశలో కొడంగల్ నియోజకవర్గంలోని 8 మండలాల విద్యార్థులకు సేవలు లభిస్తాయి. ఈ అక్టోబర్‌లో చివరలో అమలులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి.వెంకట్రెడ్డి, 'కడా' ప్రత్యేక అధికారి, కొడంగల్.

# కూరగాయల ఖిల్లా.. జేబులు గుల్ల



పరిగి : అసలే పండగల సీజన్. సాధారణ రోజులతో పోల్చితే కాస్త ఖర్చులు ఎక్కువే. ఇలాంటి సమయంలో ఓవైపు నిత్యావసరాలు, మరోవైపు కూరగాయల ధరలు తారా జువ్వల మాదిరి పైపైకి పోతున్నాయి. వీటిని అందుకునే స్థోమత లేక సామాన్యుడి మొదలు ఉన్నతాదాయ వర్గాల వరకు బెంబేలెత్తిపోతున్నారు. దీనికి సంబంధించి కథనం.

రైతులకు చేకూరని ప్రయోజనం

సంవత్సరాలుగా 'కూరగాయల హబ్'గా వికారాబాద్ జిల్లాకు పేరుంది. మొత్తం 20 మండలాల్లో పంటలు సాగవుతున్నాయి. కానీ రైతులకు, వినియోగదారులకు మాత్రం ప్రయోజనం లేకుండా పోతోంది. పండిన పంటను దాచేందుకు సరైన గిడ్డంగులు లేవు. శీతల గిడ్డంగుల ఊసే లేదు. దీంతో రైతులకు కష్టానికి తగిన ఫలితం దక్కడంలేదు. దళారులకు మాత్రం లాభిస్తోంది.

జిల్లాలోని వికారాబాద్, పరిగి, కొడంగల్, తాండూరు నియోజకవర్గాల పరిధిలో ఖరీఫ్‌లో 4904 ఎకరాల్లో వివిధ రకాల కూరగాయలు సాగులోకి వచ్చాయి. వెరసి లక్ష టన్నుల ఉత్పత్తి అంచనా. వేసవిలో దాదాపు 9వేల ఎకరాలకు పైగా సాగులోకి వచ్చే అవకాశముంది. స్థానికంగా పండిసున్నా ధరలు దిగిరాకపోవడంతో ఉన్నంతలో సర్దుకుపోవాల్సి వస్తోందని వినియోగదారులు వాపోతున్నారు. రూ.50కి ఏవీ తక్కువగా లభించడం లేదని చివరకు ఆకు కూరలు సైతం కిలోకు రూ.40నుంచి రూ.80 వరకు విక్రయిస్తున్నారని తెలిపారు.

ఖరీఫ్ సాగు వివరాలు

కూరగాయలు పండిస్తున్న రైతులు: 5977

సాగు విస్తీర్ణం: 4904.39 ఎకరాలు

దిగుబడి అంచనా: లక్ష టన్నులు

ఏడాదిగా తగ్గడం లేదు

– నర్సమ్మ, గృహిణి, దౌల్తాబాద్

నిత్యావసర సరకుల ధరలకు తోడు కూరగాయల ధరలు కూడా మండిపోతున్నాయి.సామాన్యులు ఎక్కువగా వాడే టమాట ధర మళ్లీ పెరుగుతూ వస్తోంది. పండగల సమయంలో కొనుగోలు చేయడం తలకుమించిన భారంగా మారుతోంది. పేదలకు అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.పెరటి తోటలపై దృష్టి సారించాలి– వైజయంతి, ఉద్యానాధికారిణి, పరిగి డివిజన్ ధరల నుంచి పేదలు బయటపడేందుకు పెరటి తోటల పెంపకం ఎంతో మేలు. ఇళ్లముందు ఖాళీ స్థలాలు ఉంటే చాలు రకరకాల కూరగాయలు, చిన్నచిన్న తొట్లలో ఆకు కూరలను పండించుకోవడం అన్ని విధాలుగా కలిసి వస్తుంది. ఇంటి పైకప్పులపైనా సులువుగా సాగు చేసుకోవచ్చు. ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుంది.

# విస్తరణకు సానుకూలం.. పరిహారంపై అభ్యంతరం



హైదరాబాద్: పాతబస్తీ మెట్రోరైలు మార్గంలో భూసేకరణ ప్రక్రియ కొనసాగుతుంది. 500 ఆస్తులకు సంబంధించి ఇప్పటికే రెవెన్యూ అధికారులు నోటిఫికేషన్లు జారీ చేశారు. మొత్తం 1200 వరకు ఆస్తులను సేకరించాల్సి ఉంది. ఇప్పటికే జారీ చేసిన నోటిఫికేషన్‌లో ఆస్తులున్న బాధితుల్లో కొందరు అభ్యంతరాలు చెబుతుండగా.. ఎక్కువ మంది సానుకూలంగా ఉన్నారని.. త్వరితగతినే ప్రక్రియను పూర్తిచేస్తామని మెట్రోరైలు అధికారులు చెబుతున్నారు.

రూ.60వేల వరకు.. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కి.మీ. మార్గంలో సేకరించాల్సిన ఆస్తుల యాజమానులు కొందరు చదరపు గజానికి రూ.2 లక్షల వరకు పరిహారం ఇవ్వాలని పట్టుబడుతున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన రిజిస్ట్రేషన్ ధర చదరపు గజం ధర రూ.26వేలుగా ఉంది. భూసేకరణ చట్టం ప్రకారం నగరాల్లో రెండింతల పరిహారం చెల్లించాల్సి ఉంటుంది. ఈ ప్రకారం రూ.52 వేలు అవుతుంది. నిర్మాణానికి, ఇతర ఖర్చులు లెక్కకట్టి రూ.60వేల వరకు పరిహారం ఇచ్చేందుకు మెట్రో సిద్ధమైంది. పాత భవనాలు కావడంతో సానుకూలంగా ముందుకొస్తున్నారని అధికారులు చెబుతున్నారు. పరిహారం విషయంలో అభ్యంతరాలు ఉండటంతో మెట్రో అధికారులు సంప్రదింపులు జరుపుతున్నారు. ఇప్పటికే మూడు పర్యాయాలు నిర్వాసితులతో సమావేశాలు జరిపినట్లు హైదరాబాద్ మెట్రోరైలు సంస్థ అధికారులు చెప్పారు.

100–120 అడుగుల మేర..

జీహెచ్ఎంసీ మాస్టర్‌ప్లాన్ ప్రకారం 100 అడుగుల వెడల్పు ఉండేలా విస్తరణ చేపట్టనున్నారు. స్టేషన్లు నిర్మించే చోట 120 అడుగుల మేర విస్తరిస్తారు.దారుల్‌షిఫా నుంచి శాలిబండ వరకు ప్రస్తుతం రహదారి 50 నుంచి 60 అడుగులు మాత్రమే ఉంది. ఇక్కడ ఒక్కోవైపు 20 నుంచి 25 అడుగుల మేర ఆస్తులను సేకరించాల్సి ఉంది.

శాలిబండ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 80 అడుగుల వెడల్పు రహదారి ఉంది. ఇక్కడ ఇరువైపుల పది అడుగుల మేర విస్తరించాలి. తక్కువ ప్రభావం ఉండటంతో మొదట ఇక్కడి నుంచి సేకరణ ప్రక్రియ చేపట్టారు.

# అవస్థ తీరేలా.. మురుగు వ్యవస్థ

హైదరాబాద్: మహానగరంలో మురుగునీటి వ్యవస్థను గాడిన పెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా రాజధానితోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో 7,200 కిలోమీటర్ల పొడవునా కొత్తగా డ్రైనేజీ వ్యవస్థను రూపొందించాలని నిర్ణయించింది. ఈ ప్రాజెక్టును ఇటీవల కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. రెండు రోజుల కిందట కేంద్రంలోని పెద్దలను కలిసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ ప్రాజెక్టును అమృత్‌లో భాగం చేసి నిధులు మంజూరు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం కూడా ఈ ప్రాజెక్టుపై పరిశీలన చేస్తోంది. దశలవారీగా ఈ ప్రాజెక్టును మొదలు పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించడంతో అధికారులు క్షేత్రస్థాయిలో కార్యాచరణ రూపొందించారు.

సమగ్ర నివేదిక..

ప్రస్తుతం మహానగరంలో 7వేల కిలోమీటర్ల పొడవున డ్రైనేజీ లైను ఉంది. వీటిలో అధిక భాగం 50 ఏళ్ల కిందట నిర్మించివే. దీంతో చిన్నపాటి వర్షానికే మురుగు రోడ్లపై పొంగుతోంది. కొత్తగా డ్రైనేజీ వ్యవస్థను నిర్మించడానికి గత ప్రభుత్వం నివేదికను రూపొందించినా నిధులు లేకపోవడంతో ఆ ప్రాజెక్టు మొదలుకాలేదు. ప్రస్తుతం పాతబస్తీలో రూ.200 కోట్లతో కొత్త డ్రైనేజీల నిర్మాణం జరుగుతోంది. మిగిలిన చోట్ల అలానే వదిలేశారు. ఈనేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం



ముంబయికి చెందిన సాహ్ కన్సల్టెంట్ సంస్థకు డ్రైనేజీ వ్యవస్థ ఎలా ఉండాలన్న దానిపై పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. సదరు సంస్థ క్షేత్రస్థాయిలో పరిశీలించి.. రాజధానిలో మురుగు రోడ్లపైకి రాకుండా ఉండాలంటే బల్దియా పరిధిలో 2,600 కిలోమీటర్ల మేర కొత్తగా డ్రైనేజీ నిర్మించాలని నివేదికలో పేర్కొంది. ఔటర్ వరకు మరో 4,600 కిలోమీటర్ల మేర భూగర్భ డ్రైనేజీతోపాటు మురుగు శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరింది. ఇందుకు రూ.17,212 కోట్ల వ్యయం అవుతుందని అంచనా రూపొందించింది. కేంద్రం నుంచి కొంతమేర నిధులు అందే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయ పడుతున్నారు. అవసరమైతే ఆర్థిక సంస్థల నుంచి రుణం తీసుకోవాలని ప్రభుత్వం యోచిస్తోంది.

## కొర్రీలు లేకుంటే కొండంత అండ

పెద్దపల్లి : విత్తనం నుంచి కోత వరకు పంటల సాగులో నానా కష్టాలు పడుతున్న రైతులు చేతికొచ్చిన ధాన్యాన్ని విక్రయించడానికీ అవస్థలు పడాల్సి వస్తోంది. అన్నదాతకు మద్దతు ధర అందించేందుకు ప్రభుత్వం ప్రతి సీజన్‌లో కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తున్నా మిల్లర్లు, నిర్వాహకుల చేతుల్లో మోసాలు తప్పడం లేదు. రోజుల తరబడి కేంద్రాల్లో పడిగాపులు, వర్షాలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వానాకాలం వరి పైర్లు కోత దశలో ఉన్నాయి. దసరా తర్వాత కోతలు ప్రారంభం కానుండగా కొనుగోలు కేంద్రాలకు సంబంధించి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఏటా తూకంలో కోతలు, తేమ పేరిట కొర్రీలతో నష్టపోతున్న నేపథ్యంలో ఈసారైనా ఇబ్బందులు లేకుండా ఉన్నతాధికారుల పర్యవేక్షణ పెరగాలని రైతులు కోరుతున్నారు. జాప్యంతో నష్టం అకాల వర్షాలతో ధాన్యం తడిసిపోతున్నందున కొనుగోలు కేంద్రాలను ఎత్తయిన ప్రదేశాల్లో నిర్వహించాలి. చాలా చోట్ల స్థల సమస్యతో కల్లాలను లోతట్టు ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తుండటంతో రైతులు నష్టపోతున్నారు.

కొనుగోలు కేంద్రాల నిర్వహణ బాధ్యతను ఏళ్ల తరబడి ఒకరికే బాధ్యతలు అప్పగిస్తుండటంతో అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపణలున్నాయి.ధాన్యాన్ని సంచి బరువుతో కలిపి 40.650 కిలోలకు తూకం వేయాల్సి ఉండగా అదనంగా 2 నుంచి 4 కిలోల వరకు వేస్తున్నారు.సకాలంలో ట్రక్‌షీట్లు ఇవ్వకుండా మిల్లర్లు జాప్యం చేస్తున్నారు. దీంతో డబ్బులు జమ కావడం లేదు.

తూకం వేసిన ధాన్యం తరలింపులో జాప్యంతో సంచుల్లోనే మొలకెత్తుతోంది. గన్నీ సంచుల కొరత ఉంది.

అడుగడుగునా మోసం

కొనుగోలు కేంద్రాల్లో ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న ధాన్యాన్ని మాత్రమే తూకం వేస్తున్నారు. అయినా మిల్లర్లు తరుగు, తాలుతో కోతలు విధిస్తూ దోచుకుంటున్నారు. సీజన్ మొదట్లో అధికారుల పర్యవేక్షణ బాగానే ఉంటున్నా క్రమంగా తగ్గుతోంది. దీంతో నిర్వాహకులు, మిల్లర్లు కుమ్మక్కై రైతులను ముంచుతున్నారు. తూకంలోనూ వరుస క్రమం పాటించకుండా పలుకుబడి ఉన్న వారికి పెద్దపీట వేస్తున్నారు. రోజుల తరబడి ధాన్యం నిల్వ ఉండటంతో అకాల వర్షాలకు రైతులు నష్టపోవాల్సి వస్తోంది.

సమన్వయ లోపం

ధాన్యం సేకరణలో పౌర సరఫరాలు, జిల్లా సహకార, వ్యవసాయ, రెవెన్యూ తదితర శాఖల మధ్య సమన్వయం లోపిస్తోంది.

లారీల్లో బస్తాలు నింపే క్రమంలో కొంత ధాన్యం రాలిపోతోంది. మిల్లర్లు తూకం వేస్తుండగా తరుగు వస్తోంది. నాసిరకం గన్నీ సంచులతోనూ రైతులు నష్టపోతున్నారు.

మిల్లులకు తరలించే ధాన్యాన్ని ఎప్పటికప్పుడు దింపుకొనేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

మంథని, ముత్తారం, రామగిరి, కాల్వశ్రీరాంపూర్, పెద్దపల్లి మండలాల్లో ధాన్యం సేకరణలో జాప్యం నివారించాలి.

కొర్రీలు విధించిన ధాన్యాన్ని కేంద్రాల నిర్వాహకులు తమ బంధువుల పేరిట ఆన్‌లైన్‌లో నమోదు చేసి డబ్బులు దండుకుంటున్నారు.

మంథని మండలం నాగేపల్లి సహకార సంఘం కొనుగోలు కేంద్రంలో కోతలు విధించి డబ్బుల చెల్లింపులో జాప్యం చేస్తున్నారంటూ రైతులు పోలీసులను ఆశ్రయించారు. నాలుగు నెలల తర్వాత డబ్బులో కోతలు విధించి చెక్కులు అందజేశారు.

పెద్దపల్లి మండలం అప్పన్నపేట, రాఘవపూర్ కేంద్రాల్లో ప్రతి సీజన్‌లో ధాన్యం సేకరణ ఆలస్యం అవుతుండటం, రైతులు ఆందోళనకు దిగడం పరిపాటిగా మారింది. ఇక్కడ లోతట్టు ప్రాంతాల్లో కేంద్రం నిర్వహణతో కొద్దిపాటి వర్షానికే ధాన్యం తడుస్తోంది.

గత ఇబ్బందులపై సమీక్షిస్తున్నాంధాన్యం సేకరణలో గతంలో ఎదురైన సమస్యలను సమీక్షిస్తున్నాం. కేంద్రాల నిర్వాహకులపై నిఘా పెంచుతున్నాం. కొన్ని చోట్ల కొనుగోలు బాధ్యతలు కొత్త వారికి ఇవ్వాలని సూచిస్తున్నాం. తూకంలో మోసాలకు పాల్పడుతున్న వేబ్రిడ్జిలను మూసివేసి నోటీసులు ఇస్తున్నాం.







# కడప స్టీల్ ప్లాంట్ అంటే కొబ్బరి కాయలు కొట్టే ప్రాజెక్టా?: వైఎస్ షర్మిల

కడప: సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెడుతూ వేధింపులకు గురి చేసే వారిని కఠినంగా శిక్షించాలని ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి అన్నారు. వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె సునీత, వైఎస్ విజయలక్ష్మి, తనపైనా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టించిన కడప ఎంపీ అవినాష్ రెడ్డిని తక్షణమే అరెస్టు చేయాలని షర్మిల డిమాండ్ చేశారు. తమ అందరిపై అవినాష్ రెడ్డే పోస్టులు పెట్టించారని పోలీసులు నిర్ధారణకు వచ్చారని.. అలాంటప్పుడు అతన్ని ఎందుకు విచారించడం లేదు, అరెస్టు చేయడం లేదంటూ ఆమె ప్రశ్నించారు. ఇలాంటి వారిని కఠినంగా శిక్షించాల్సిందే అంటూ డిమాండ్ చేశారు. కడప స్టీల్ ప్లాంట్ కోసం కడప కలెక్టర్ కార్యాలయం ఎదుట షర్మిల నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె వినూత్న నిరసన చేపట్టారు. కడప స్టీల్ ప్లాంట్ అంటే కొబ్బరికాయలు కొట్టే ప్రాజెక్టు అంటూ కొబ్బరికాయలతో కలెక్టరేట్ ఎదుట నిరసనకు దిగారు. ఈ సందర్భంగా ఏపీసీసీ చీఫ్ షర్మిల మాట్లాడుతూ.. "సోషల్ మీడియా సైకో వర్రా రవీందర్ రెడ్డి కేసులో ఎంపీ అవినాష్ రెడ్డిని పోలీసులు వెంటనే అరెస్టు చేసి విచారణ చేయాలి. రవీందర్ రెడ్డిపై కడప జిల్లాలో నేను కేసు పెట్టినా, పెట్టకపోయినా పోలీసులు విచారణ కొనసాగించాలి. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టింది ఎవరో వాటిని పెట్టించింది ఎవరో పోలీసులు నిగ్గు తేల్చాలి. సజ్జల భార్గవరెడ్డి అనే వ్యక్తి దీనికంతటికీ మూల కారణం. అతన్ని పోలీసుల ఎందుకు అరెస్టు చేయలేదు. సజ్జల భార్గవరెడ్డిని, అవినాష్ రెడ్డిని వెంటనే అరెస్ట్ చేయాలి. కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు ఎన్డీయే ప్రభుత్వం చొరవ చూపాలి. మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఉక్కు పరిశ్రమ కోసం రెండుసార్లు టెంకాయ కొట్టారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నందున ఉక్కు పరిశ్రమపై దృష్టి పెట్టాలి. జిల్లాలో ఉక్కు పరిశ్రమ కలగానే మిగిలిపోయే ప్రమాదం ఉంది. కడప స్టీల్ ప్లాంట్ అంటే కొబ్బరికాయలు కొట్టే ప్రాజెక్టుగా మారిపోయింది. రాష్ట్రంలో అధికారం మారిన ప్రతిసారీ నూతన ముఖ్యమంత్రి టెంకాయ కొట్టడం ఆనవాయితీ అయిపోయింది. కానీ ప్రాజెక్టు పనులు మాత్రం ముందుకు వెళ్లడం లేదు. 2019 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కడప స్టీల్ ప్లాంట్ అంశాన్ని చంద్రబాబు వాడుకున్నారు. అప్పుడు అధికారంలోకి వచ్చిన మా అన్న జగన్.. ఆస్కార్ డైలాగ్స్ చెప్పి మళ్లీ టెంకాయ కొట్టి మరో సంస్థకు బాధ్యతలు అప్పగించారు. జమ్మలమడుగు రుణం తీర్చుకుంటానని చెప్పి వారిని మోసం చేశారు. సజ్జన్ జిందాల్, జగన్ మోహన్ రెడ్డి బంధం ఎలాంటిదో సీఎంగా జగన్ దిగిపోయిన తర్వాత ఏపీ ప్రజలకు అర్థమయ్యింది. కడప స్టీల్ ప్లాంట్‌పై పాలకులకు ఎందుకంత చిన్నచూపో అర్థం కావడం లేదు. వివేకా హత్య కేసులో వేగం పెరగడం శుభపరిణామం. ఇప్పటికైనా సునీత, సౌభాగ్యమ్మకు న్యాయం జరుగుతుందని భావిస్తున్నా. బాధితురాలైన సునీతకు తానెప్పుడూ అండగానే ఉంటా" అని షర్మిల చెప్పారు.

# పోలవరం ప్రాజెక్టులో జగన్ వాటా ఎంతంటే.. శాసనభసలో బయటపెట్టిన సీఎం

పోలవరం ప్రాజెక్టును 2027కల్లా పూర్తిచేసి తీరుతామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అసెంబ్లీలో ప్రకటించారు. 2014 నుంచి 2019 మధ్య కాలంలో 72 శాతం ప్రాజెక్టు పనులు పూర్తయ్యాయని, 2019లో ప్రభుత్వం మారిన తర్వాత పోలవరం ప్రాజెక్టును పక్కనపెట్టేశారన్నారు. 2019 నుంచి 2024 మధ్య కాలంలో కేవలం 3.5 శాతం మాత్రమే ప్రాజెక్టు పనులు పూర్తయ్యాయని వెల్లడించారు. దీంతో ఐదేళ్ల కాలంలో జగన్ పోలవరం ప్రాజెక్టుకు ఎంతటి ప్రాధాన్యత ఇచ్చారో అర్థమవుతోంది. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు, ప్రథమంగా రైతాంగానికి ఎంతో ముఖ్యమైన ఈ ప్రాజెక్టుపై గత వైసీపీ ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరించిందనే విషయం శాసనసభలో ప్రభుత్వం చెప్పిన గణాంకాల ఆధారంగా తెలుస్తోంది. 2014 నుంచి 2019 మధ్య ఐదేళ్లలో 72 శాతం పనులు పూర్తయితే.. ఏడాదికి సగటున 14.శాతం పనులు పూర్తి చేయాల్సి ఉంటుంది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో కేవలం 3.5 శాతం పనులు మాత్రమే పూర్తిచేసింది. ఏడాదికి ఒక శాతం పనులు కూడా పూర్తి చేయలేదు. 2019లో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించి పనులను కొనసాగిస్తే రెండేళ్ల కాలంలో అంటే 2021కల్లా పోలవరం ప్రాజెక్టు పూర్తై ఉండేదని, జగన్ నిర్లక్ష్యంతో పోలవరం ప్రాజెక్టు సకాలంలో పూర్తి కాకపోవడమే కాకుండా ప్రాజెక్టు వ్యయం భారీగా పెరిగిపోయిందని సీఎం చంద్రబాబు తెలిపారు. అధికారంలో ఉన్న సమయంలో పోలవరం ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేస్తామని, తమ ప్రభుత్వ ప్రాధాన్యతల్లో అదొకటంటూ చెప్పుకొచ్చిన వైసీపీ తమ పదవీ కాలంలో కేవలం 3.5 శాతం మాత్రమే పనులను పూర్తి చేసినట్లు ప్రస్తుత ఏపీ ప్రభుత్వం స్పష్టం చేసింది.

**జగన్ వాటా ఇదే..** పోలవరం ప్రాజెక్టుపై గొప్పలు చెప్పుకునే వైసీపీ నాయకులు తాజా ప్రభుత్వ ప్రకటనపై ఎలా స్పందిస్తారనేది ఆసక్తిగా మారింది. ఐదేళ్లు అధికారంలో ఉన్న వైసీపీ వాటా పోలవరం ప్రాజెక్టు పూర్తిచేయడంలో కేవలం 3.5 శాతం మాత్రమేనట. ప్రస్తుతం 75.5 శాతం ప్రాజెక్టు పనులు పూర్తికాగా.. 72 శాతం పనులు గత టీడీపీ ప్రభుత్వం పూర్తిచేయగా.. జగన్ ప్రభుత్వం వాటా 3.5 శాతం మాత్రమే. మిగిలిన 25 శాతం పనులను రెండేళ్లలో పూర్తిచేస్తామని తద్వారా లక్షల ఎకరాలకు సాగునీరందుతుందని సీఎం చంద్రబాబు శాసనసభలో ప్రకటించారు.


**వైసీపీ స్పందన...** పోలవరం ప్రాజెక్టు విషయంలో గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని కూటమి ప్రభుత్వం ప్రజల ముందు ఉంచడంతో ఆ పార్టీ నేతలు ఎలా స్పందిస్తారనేది వేచి చూడాలి. పోలవరంపై లెక్కలు బయటకు రావడంతో వాటిపై ప్రజల్లో చర్చ జరగకుండా ప్రభుత్వంపై బురదజల్లేందుకు వైసీపీ మరో కొత్త నాటకానికి తెరలేపే అవకాశం లేకపోలేదని కూటమి నేతలు అంటున్నారు.

# ఉద్దేశ పూర్వకంగానే ఎంఎన్‌సీ మద్యం కంపెనీలను తరిమేశారు: మంత్రి కొల్లు రవీంద్ర



అమరావతి: స్వార్థ ప్రయోజనాల కోసం గత ప్రభుత్వం మద్యం విధానాన్ని మార్చేసిందని మంత్రి కొల్లు రవీంద్ర ఆరోపించారు. ఉద్దేశపూర్వకంగా ఎంఎన్‌సీ మద్యం కంపెనీలను రాష్ట్రం నుంచి తరిమేసిందన్నారు. అసెంబ్లీలో నూతన మద్యం విధానంపై చర్చలో భాగంగా మంత్రి మాట్లాడుతూ.. వైకాపా విధానాలపై విమర్శలు గుప్పించారు "నాసిరకం మద్యం తాగి అనేకమంది అనారోగ్యం పాలయ్యారు. నాసిరకం మద్యంతో కిడ్నీ, కాలేయం సంబంధిత జబ్బులు పెరిగాయి. మద్యం తయారు చేసే 26 కొత్త కంపెనీలు తీసుకొచ్చారు. మద్యం విషయంలో వైకాపా పాలకులు వ్యవస్థీకృత దోపిడీ చేశారు. ఆన్‌లైన్ పేమెంట్స్ లేకుండా వ్యవస్థను నాశనం చేశారు. పరిపాలన చేతకాక ఆఖరికి బాండ్లు కూడా తాకట్టు పెట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నూతన మద్యం విధానాన్ని తీసుకొచ్చాం. ఆరు రాష్ట్రాల్లో అధ్యయనం చేసి మద్యం పాలసీ తెచ్చాం. మేం వచ్చాక మద్యం విషయంలో పారదర్శకంగా పని చేశాం. దుకాణాల దరఖాస్తు ఫీజు కిందే రూ.1,800 కోట్లు వచ్చింది. 12 ప్రీమియం మద్యం దుకాణాలు ఏర్పాటు చేయాలని సబ్‌కమిటీ సిఫార్సు చేసింది. రూ.99కే నాణ్యమైన మద్యం ఇస్తున్నాం. పలు చోట్లు డీఅడిక్షన్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం" అని కొల్లు రవీంద్ర తెలిపారు.

# ఒక్కో ఇటుకా పేరుస్తూ ముందుకెళ్తున్నాం: సీఎం చంద్రబాబు



అమరావతి: గతంలో ఎన్నడూ లేనివిధంగా 2024 ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇచ్చారని సీఎం చంద్రబాబు అన్నారు. 150 రోజుల్లో తమ ప్రభుత్వం చేపట్టిన పనులను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత తనపై ఉందని చెప్పారు. వైకాపా పాలనలో జరిగిన అక్రమాలపై ఎంత తవ్వితే అంత భయంకరమైన విషయాలు వెలుగులోకి వస్తున్నాయన్నారు. ఒక్కో ఇటుకా పేరుస్తూ ముందుకెళుతున్నామని చెప్పారు. శాసనసభలో సీఎం మాట్లాడారు. "నాలుగు దశాబ్దాలుగా ప్రజలు నన్ను ఆదరించారు. వారికి జీవితాంతం రుణపడి ఉంటాను. ప్రజల కోసం నిరంతరం అధ్యయనం చేస్తూ నిత్య విద్యార్థిలా నేర్చుకున్నాను. ఎన్నో కష్టాలు చూశా.. అవమానాలు ఎదుర్కొన్నా. 24 క్లైమోర్‌మైన్స్‌తో దాడి చేస్తే వేంకటేశ్వరస్వామి పునర్జన్మ ప్రసాదించి ప్రాణభిక్ష పెట్టారు. ఈ సభలోనే నా కుటుంబసభ్యులను అవనమానపరిచేలా మాట్లాడారు. ఆ సమయంలో తీవ్ర ఆవేదన కలిగింది. వేధింపులకు గురిచేసి చివరికి జైలుకు పంపించారు. నేను ఏ తప్పూ చేయలేదు.. చేయను. అనుక్షణం ప్రజల కోసమే పనిచేస్తా. అలాంటి ఇబ్బందులు పెట్టినప్పుడు ఇంకా మనోధైర్యంతో ముందుకెళ్లాను. చాలా అరుదైన సంఘటనలు నా జీవితంలో చూశాను. 53 రోజులు జైల్లో ఉన్నప్పుడు ప్రపంచదేశాల్లోని తెలుగువారు రోడ్డుపైకి వచ్చి పోరాడారు. ప్రజలు ఇచ్చిన స్థానాన్ని ఎవరు చెరపాలన్నా చెరగదు. నాలుగోసారి సీఎంగా బాధ్యతలు చేపట్టాను. ఇది అరుదైన అనుభవం. నాపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించారు. అధికారం, సీఎం కుర్చీ, కేంద్ర రాజకీయాలు కూడా కొత్త కాదు. ప్రాంతీయ పార్టీగా తెదేపా కేంద్రంలో ఎన్నోసార్లు కీలకపాత్ర పోషించింది. విధ్వంసమైన వ్యవస్థలు, గాడితప్పిన యంత్రాంగం, గత ప్రభుత్వ అప్పులు, తప్పులు ఈ ప్రభుత్వానికి సవాలుగా మారాయి. ఈ రాష్ట్రాన్ని బాగు చేయగలమనే నమ్మకముందా? అని కొందరు అడిగారు. నేను పారిపోను.. అధికారం ఉన్నా, లేకున్నా ప్రజల కోసమే పనిచేశా. ఇప్పుడు కూడా అలాంటి సవాల్‌ను స్వీకరించి మళ్లీ ప్రజలను నిలబెడతానని చెప్పాను. అది చేసి తీరతానని ముందుకొచ్చాను. 21 మంది ఎంపీలతో దిల్లీలో మన పరపతి పెరిగింది. ఒక్కో ఇటుకా పేరుస్తూ ముందుకెళ్తున్నాం. రాత్రికి రాత్రే ఏదీ సాధ్యం కాదు. ఈ విషయాన్ని ఎమ్మెల్యేలు ప్రజలకు తెలియజేయాలి. అంకితభావంతో పనిచేస్తూ రాజీ లేకుండా ముందుకెళ్తాం.


**ఆడబిడ్డల జోలికొస్తే ఖబడ్దార్ :** వైకాపా ప్రభుత్వం శాంతిభద్రతలను గాలికొదిలేసిందని సీఎం చంద్రబాబు విమర్శించారు. శాసనసభ సమావేశాల్లో ఆయన ప్రసంగించారు. "గత ప్రభుత్వ హయాంలో పోలీసు వ్యవస్థను నిర్వీర్యం చేశారు. రాజకీయ నాయకులను నిర్వీర్యం చేయాలనే ప్రయత్నం చేశారు. ఆడబిడ్డల జోలికొస్తే ఖబడ్దార్.. ఊరుకునేది లేదు. కఠిన చర్యలు తీసుకుంటాం. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పెద్దఎత్తున ర్యాలీ చేపడతాం. పిల్లలకు కూడా అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉంది. ఎవరైనా భూకబ్జాలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరిస్తున్నా" అని చంద్రబాబు చెప్పారు.

# వైకాపా ప్రతిపాదనల కారణంగానే ట్రూఅప్ ఛార్జీల వసూలు: మంత్రి గొట్టిపాటి



అమరావతి: ఏపీలో విద్యుత్ వ్యవస్థను వైకాపా ప్రభుత్వం నాశనం చేసిందని, ఆ వ్యవస్థను నిర్వహించడంలో విఫలమైందని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి ధ్వజమెత్తారు. గత ప్రభుత్వం పీపీఏల రద్దు సహా చేసిన తప్పిదాల కారణంగా ప్రజలపై ట్రూ అప్ ఛార్జీల పేరిట రూ.20 వేల కోట్లపైగా భారం పడిందన్నారు. గత ప్రభుత్వం 9 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి సామాన్యులపై పెను భారం వేసిందన్నారు. గత ప్రభుత్వం ఈఆర్సీకి పంపిన ప్రతిపాదనల వల్లే ట్రూ అప్ ఛార్జీలు వసూలు చేయాల్సి వస్తుందని మంత్రి వివరణ ఇచ్చారు. ట్రూ అప్ ఛార్జీలు వసూలుకు గత వైకాపా ప్రభుత్వమే కారణమన్నారు. ట్రూఅప్ ఛార్జీలపై శాసన మండలిలో ఎమ్మెల్సీలు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. భవిష్యత్తులో విద్యుత్ ఛార్జీలు పెంచకుండా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అవసరాలకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తిని పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు..

# గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే బుడమేరుకు వరదలు: మంత్రి నిమ్మల



అమరావతి: ఏపీలో గత ప్రభుత్వ పాపం, నిర్లక్ష్యం కారణంగానే బుడమేరుకు వరదలొచ్చాయని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆగ్రహం వ్యక్తంచేశారు. విజయవాడలో బుడమేరు వాగుకు వచ్చిన వరదలపై శాసన మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం చెప్పారు. బుడమేరు డైవర్షన్ కెనాల్ పూర్తిచేయడంలో వైకాపా ప్రభుత్వం విఫలమైందని మంత్రి నిమ్మల తెలిపారు. గత ఐదేళ్లలో బుడమేరు డైవర్షన్ కెనాల్ పనుల పూర్తికి ఎలాంటి చర్యలు చేపట్టలేదని మండిపడ్డారు. ఒకేసారి 15 వేల క్యూసెక్కుల నీరు రావడంతో గండ్లు పడి వరదలు వచ్చాయని చెప్పారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగానే బుడమేరుకు వరదలొచ్చాయని, భవిష్యత్తులో వరదలు రాకుండా ఆపరేషన్ బుడమేరు చేపడతామని మంత్రి నిమ్మల పేర్కొన్నారు. అదేవిధంగా గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు ఇప్పటికే చర్యలు చేపట్టామని మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. 2027 గోదావరి పుష్కరాల నేపథ్యంలో పురపాలక శాఖ, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖల నుంచి వచ్చిన ప్రతిపాదనల మేరకు ఘాట్ల నిర్మాణాన్ని జలవనరుల శాఖ తీసుకుంటుందని ఆయన తెలిపారు. అన్ని ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పుష్కరాలకు ఏర్పాట్లు చేస్తామని వివరించారు. ప్రతిరోజూ గోదావరి హారతి నిర్వహించాలని నిర్ణయించామని మంత్రి చెప్పారు. అయితే గత ఐదేళ్లలో గోదావరి హారతిని నిలిపివేశారన్న మంత్రి.. ప్రజల సంస్కృతి, సంప్రదాయాలపై కూడా వైకాపా ప్రభుత్వం దాడి చేసిందన్నారు.

# ఏపీలో జనరిక్ ఔషధ విక్రయాలు 7 శాతం మాత్రమే: మంత్రి సత్యకుమార్




అమరావతి: వైద్యులు ఎక్కువగా జనరిక్ మందులను సిఫార్సు చేయకపోవడం వల్లే ప్రజల్లో అవగాహన తక్కువగా ఉందని ఏపీ వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. మొత్తం 560 రకాల జనరిక్ మందులను వినియోగించేందుకు వీలుగా కార్యాచరణను చేపట్టామని తెలిపారు. జనరిక్ మందుల నాణ్యత, ప్రమాణాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తామన్నారు. బ్రాండెడ్ మందులు, జనరిక్ ఔషధాలకు ఎలాంటి తేడా లేదని మంత్రి చెప్పారు. ప్రస్తుతం ఏపీలో 215 జనరిక్ ఔషధ కేంద్రాలు మాత్రమే ఉన్నాయని, గత ప్రభుత్వం వీటిని నిర్లక్ష్యం చేసిందన్నారు. రాష్ట్రంలో 2.15 లక్షల కోట్ల ఔషధాల విక్రయాలు జరుగుతుండగా.. వాటిలో జనరిక్ ఔషధ విక్రయాలు 7శాతం మాత్రమే ఉన్నాయన్నారు. ఈ అంశంపై శాసనసభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు.

# నగర ప్రథమ పౌరుడు మాట్లాడేది ఇలాగేనా?.. గుంటూరు మేయర్‌పై హైకోర్టు ఆగ్రహం



అమరావతి: అరండల్‌పేట పోలీసులు తనపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ గుంటూరు మేయర్ కావటి మనోహర్ నాయుడు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. "నగర ప్రథమ పౌరుడు మాట్లాడేది ఇలాగేనా? అసభ్య పదజాలంతో దాడి చేస్తారా? అసభ్య భాష వాడే వారు ఏ పార్టీవారైనా శిక్షించాల్సిందే. సేవ ద్వారా ప్రజలకు దగ్గరవ్వాలి.. అసభ్య భాషతో కాదు. బాధ్యతగా మెలగాలని గుంటూరు మేయర్‌కు చెప్పండి" అని ఆయన తరఫు న్యాయవాదికి హైకోర్టు సూచించింది. మనోహర్ నాయుడుకు నోటీసు ఇచ్చి వివరణ తీసుకోవాలని పోలీసులను ఆదేశించింది. తదుపరి విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది. ఈ కేసుకు సంబంధించి పూర్తి వివరాలు సమర్పించాలని పోలీసులను ఆదేశించింది. "తెదేపా జాతీయ అధ్యక్షుడు, అప్పటి ప్రతిపక్షనేత చంద్రబాబు అక్రమ అరెస్టుని వ్యతిరేకిస్తూ శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్న మాపై మేయర్, అనుచరులు తీవ్రంగా దూషించి పోలీసు లాఠీతో దాడి చేశారు. జనసేన అధినేత పవన్, నారా లోకేశ్‌ను దూషించి.. అవమాన పరిచేలా మనోహర్ నాయుడు మాట్లాడారు.." అని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు గుంటూరు అరండల్ పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా మేయర్, ఆయన అనుచరులపై పోలీసులు ఈనెల 16న కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టి వేయాలని మనోహర్ నాయుడు హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు.

# 25 ఏళ్ల ఆదాయాన్ని ఒకేసారి వైకాపా ప్రభుత్వం కాజేసింది: మంత్రి పయ్యావుల



అమరావతి: టిడ్కోలో గత ప్రభుత్వం లబ్ధిదారులకు రూ.25 వేలు తిరిగి ఇస్తామని గొప్పలు చెప్పిందని మంత్రి పయ్యావుల కేశవ్ విమర్శించారు. శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడారు. ఇళ్ల లబ్ధిదారులకు గత ప్రభుత్వం బకాయిల జాబితా పెరుగుతూనే పోయిందని చెప్పారు. లెక్కా పక్కా లేకుండా తమకు అనువైన బిల్లులే పేర్కొంటూ వచ్చారన్నారు. "ఆర్థిక మంత్రిగా ప్రమాణం చేసిన తర్వాత బకాయిలు రూ.7 వేల కోట్లు మాత్రమే అని అధికారులు చెప్పారు.. మేం లెక్కలు చూస్తే రూ.1,14,000 కోట్లుగా తేలింది. సీఏజీకి ఇచ్చిన లెక్కల ప్రకారం ప్రభుత్వ అప్పులు రూ.4,38,278 కోట్లు, పబ్లిక్ అకౌంట్ లయబిలిటీస్ రూ.80,914 కోట్లు, కార్పొరేషన్ అప్పులు రూ.2,48,677 కోట్లు, పౌర సరఫరాల శాఖ కార్పొరేషన్ బకాయిలు రూ.36 వేల కోట్లు. రెండు కార్పొరేషన్లను ఏర్పాటు చేసి శాసన సభ పర్యవేక్షణ లేకుండా డబ్బు ఖర్చు పెట్టారు.

తర్వాత మూడోదిగా ఏపీ స్టేట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కార్పొరేషన్ ఏర్పాటు చేశారు. దీని పనేంటంటే రాష్ట్రంలో డబ్బులు ఎక్కడ ఉన్నాయో చూడటం. దీని ద్వారా రాష్ట్రంలోని డబ్బును మళ్లించారు. రాబోయే 25 ఏళ్ల ఆదాయాన్ని ఒకేసారి వైకాపా ప్రభుత్వం కాజేసింది" అని పయ్యావుల కేశవ్ మండిపడ్డారు.

# జ్యోతి పూర్వజ్.. నడుముతో స్టన్నింగ్ లుక్

జ్యోతి పూర్వజ్ తాజాగా తన గ్లామర్ ఫోటోషూట్‌తో మరోసారి అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ ఫోటోలో ఆమె సిల్క్ శారీలో, సరికొత్త లుక్ ని చూపిస్తూ ఫ్యాషన్‌కు నూతన స్టైల్ ను తీసుకొచ్చింది. స్పాట్‌లైట్ కింద ఆమె చిరునవ్వు, నాజుకైన హావభావాలు నెటిజన్లను కట్టిపడేశాయి. "ఇల్యూమినేటెడ్ అండర్ ది స్పాట్‌లైట్" అనే క్యాప్షన్‌తో ఆమె షేర్ చేసిన ఈ ఫోటో నెటిజన్ల నుండి విపరీతమైన ఆదరణ పొందుతోంది. జ్యోతి పూర్వజ్ కెరీర్ గురించి చెప్పుకుంటే, ఆమె తన తొలి అడుగులను కన్నడ టీవీ సీరియల్స్ ద్వారా పెట్టారు. ఆతరువాత ఆమె తెలుగులో 'గుప్పెడంత మనసు' వంటి సీరియల్స్‌లో ముఖ్యమైన పాత్రలతో ప్రేక్షకుల గుండెల్లో స్థానం పొందారు. గుప్పెడంత మనసు సీరియల్‌లో తల్లి పాత్ర ఆమెకు మంచి గుర్తింపు తెచ్చింది. పెళ్లి తరువాత ఆమె తన పేరును జ్యోతి పూర్వజ్‌గా మార్చుకుని, మరింత గ్లామర్ ఫోటోషూట్‌లు చేస్తూ సోషల్



మీడియాలో తన ప్రత్యేకతను చూపిస్తోంది. ప్రస్తుతానికి ఆమె ఫీమేల్ లీడ్‌గా ఓ సినిమా చేస్తోంది. తన ఫిట్‌నెస్, మోడర్న్ ఫ్యాషన్‌ని ప్రదర్శిస్తూ ఆమె యువతకు స్ఫూర్తిగా నిలుస్తోంది. ఇంతకుముందు ఆమె సాధారణ పాత్రలతో మెప్పించినప్పటికీ, ఇప్పటి ఫోటోలలో ఆమె చూపిస్తున్న గ్లామర్ ఆమెను కొత్త హైట్స్‌కు తీసుకువెళ్లేలా ఉంది. నెటిజన్లు ఆమెను పొగడ్తలతో ముంచెత్తుతుండగా, "నిజమైన ఫ్యాషన్ ఐకాన్," "స్పాట్‌లైట్‌లో బ్లాక్ అండ్ వైట్ అందం," అంటూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. అభిమానులు మాత్రమే కాకుండా, ఇండస్ట్రీలోని పలువురు ఆమె టాలెంట్‌ను ప్రశంసిస్తున్నారు. ఇక జ్యోతి పూర్వజ్ నటనకు, గ్లామర్‌కు విలువ ఇచ్చే పాత్రల కోసం ఎదురు చూస్తోంది. ఏమాత్రం తగ్గకుండా తన కెరీర్‌లో మెరుగైన అవకాశాలను అందిపుచ్చుకోవాలనే ఆమె ప్రయత్నం చేస్తోంది. ఈ ఫోటోతోనే కాకుండా, తన ప్రతి ఫోటోలో కూడా ఆమె ఫ్యాషన్‌ను, స్టైల్‌ను హైలైట్ చేస్తుంది. జ్యోతి పూర్వజ్ రాబోయే రోజుల్లో పెద్ద ప్రాజెక్ట్‌లను సొంతం చేసుకుని టాలీవుడ్‌లో తన ప్రత్యేకతను నిరూపించుకుంటుందని అనిపిస్తుంది. మరి ఆమె లక్కు ఎప్పుడు యూ టర్న్ తీసుకుంటుందో కాలమే సమాధానం ఇవ్వాలి.

# యానిమల్ బ్యూటీ.. కాబోయేవాడు ఇలా ఉండాలి

సందీప్ రెడ్డి వంగా యానిమల్ చిత్రంలో రణబీర్ సరసన నటించింది ట్రిప్తి డిమ్రీ. ఓవర్ నైట్ లో అసాధారణ పాపులారిటీ సంపాదించింది. అప్పటి నుండి ఈ బ్యూటీ వెంటపడేవాళ్లు ఎక్కువయ్యారు. సూట్ కేసులతో నిర్మాతలు అడ్వాన్సులు అందిస్తున్నారు. కొత్త ప్రాజెక్టులకు ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. ఇటీవల బ్యాడ్ న్యూజ్ లో నటించింది. ఈ సినిమా కూడా చెప్పుకోదగ్గ విజయం సాధించింది. మునుముందు వరుసగా సినిమాలు రిలీజ్ కానున్నాయి. వీటిలో ట్రిప్తీ గ్లామర్ షో పై అంచనాలు భారీగా ఉన్నాయి. ఇక వ్యక్తిగత విషయాలు టచ్ చేస్తే... ట్రిప్తీ చాలా కాలంగా సామ్ మర్చంట్‌తో రిలేషన్ లో ఉందన్న కథనాలొచ్చాయి. కానీ దానిని ఈ భామ కన్ఫామ్ చేయలేదు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన లవ్ లైఫ్ గురించి మాట్లాడింది. తనకు కాబోయేవాడు ఎలా ఉండాలో



కూడా ఈ సందర్భంగా ప్రస్తావించింది. ఇంతకీ ట్రిప్తీకి కాబోయేవాడు ఎలా ఉండాలి? అంటే... 1993 రొమ్-కామ్ కభీ హాన్ కభీ నాలో షారుఖ్ ఖాన్ తన ప్రియురాలిపై ఎలాంటి ప్రేమను కనబరుస్తారో అలాంటి స్వచ్ఛమైన ప్రేమను అనుభవించాలనుకుంటున్నట్లు పేర్కొంది. ధూమ్‌లో ఉదయ్ చోప్రా పాత్రలాగే తాను కూడా ఉంటానని ట్రిప్తీ దిమ్రీ పేర్కొన్నారు. మెయిన్ ఫిల్మోన్ వాలీ రొమాంటిక్ హన్ అని ట్రిప్తీ డిమ్రీ తన యూట్యూబ్ ఛానెల్‌లో రణ్‌వీర్ అల్లాబాడియాతో ఇంటరాక్షన్‌లో చెప్పారు. షారుఖ్ ఖాన్- సుచిత్రా కృష్ణమూర్తిల కభీ హాన్ కభీ నా తనకు ఇష్టమైన రొమాంటిక్ సినిమా అని పేర్కొంది. రొమాంటిక్ కామెడీలో కింగ్ ఆఫ్ రొమాన్స్ పాత్ర గురించి మాట్లాడుతూ..ఆ సినిమాలో ఉన్న అమాయకత్వం నిజమైన ప్రేమకు చిహ్నం అని పేర్కొంది.




# మాస్ ట్యాగ్ హీరోలకే కాదు..హీరోయిన్లకు సొంతమే!





మాస్ ట్యాగ్ హీరోలకే కాదు..హీరోయిన్లకు ఇచ్చేయాల్సిన సమయం ఆసన్నమైంది. హీరోలు మాత్రమే కాదు సరైన స్టోరీ పడితే హీరోయిన్లు సైతం వందల కోట్లు వసూళ్లు తేగల సత్తా ఉన్నవారున్నారు. కాస్తో కూస్తో మేల్ డామినేషన్ కారణంగానూ వాళ్ల ట్యాలెంట్ కిల్ అవుతుంది? అన్న ఆరోపణలో కొంత నిజం లేకపోలేదు. మహిళా నటీమణుల శక్తిని గుర్తించాల్సిన సమయం ఆసన్నమైంది. వాళ్లలో ముందుగా మాస్ ట్యాగ్ అందుకోవడానికి అన్ని రకాల అర్హతలు ఉన్న భామలు వీళ్లే. అనుష్క శర్మ, నయనతార, సాయి పల్లవి, కీర్తి సురేష్, జ్యోతిక లాంటి వాళ్లు ఈ ట్యాగ్ కి అర్హులు. ప్రస్తుతం అనుష్క శర్మ ప్రధాన పాత్రలో క్రిష్ ఘాటీ అనే చిత్రాన్ని తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. ఒడిశా-ఆంధ్ర సరిహద్దు అమ్మాయి కథ ఇది. భారతదేశంలోని కొండ లోయలలో నివసించే జీవితాల్ని ఘాటీ ప్రతిబింబిస్తుంది. ఇందులో అనుష్క ఓ బాధితురాలి నుంచి క్రిమినల్‌గా, అనంతరం లెజెండ్‌గా ఎలా మారింది? అన్నది కథ. ఇటీవల రిలీజ్ అయిన గ్లింప్స్ చూస్తే అనుష్క ఏ రేంజ్ పెర్ఫార్మెన్స్ ఇచ్చిందన్నది అంచానా వేయోచ్చు. కొడవలి పట్టి పీక కసాకసా కోసిన తీరు చూస్తే? అనుష్క ఏ స్థాయి నటన కనబరిచిందో చెప్పొచ్చు. అనుష్కలో కొత్త కోణాన్ని ఘాటీ బయటకు తెచ్చిందనొచ్చు. ఇక లేడీ సూపర్ స్టార్ గా నీరాజనాలు అందుకుంటోన్న నయనతార సోలో మార్కెట్ కోసం ఎంతగా ప్రయత్నిస్తుందో చెప్పాల్సిన పనిలేదు. రక్కయి సినిమాలో నయన్ పాత్ర ఇప్పటికే రివీల్ అయింది. కుమార్తె కోసం ఓ తల్లి చేసే పోరాటమే ఈ కథ. నయన్ నటన, పోరాటం ఎంత భయంకరంగా ఉండబో తుందనేది టీజర్ లోనే చెప్పకనే చెప్పారు. ఇక కీర్తి సురేష్ అలియాస్ మహానటి కి సరైన సోలో కథ పడితే చెలరేగిపోతుంది. అందులో ఎలాంటి డౌట్ లేదు. ప్రస్తుతం రివాల్వార్ రీటాలో నటిస్తోంది. ఫ్యామిలీ మ్యాన్ -2, సీటాడెల్ లో సమంత యాక్షన్ సన్నివేశాల గురించి చెప్పాల్సిన పనిలేదు. అలాగే బాక్సాఫీస్ క్వీన్ సాయి పల్లవి గార్గి లాంటి సినిమాతో విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఈ భామకి సరైన యాక్షన్ థ్రిల్లర్ పడితే తిరుగుండదు. మాస్ పాత్రల్లో ఈ భామలంతా పక్కాగా మెప్పించగల నాయికలే.

# చిరంజీవి ప్లేస్ లో రామ్ చరణ్..?



మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'విశ్వంభర'. వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా విడుదల చేస్తామని మేకర్స్ ప్రకటించారు. మరోవైపు మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న తాజా చిత్రం 'గేమ్ ఛేంజర్'. ఈ చిత్రాన్ని క్రిస్మస్ కానుకగా రిలీజ్ చేస్తామని నిర్మాతలు తెలిపారు. దీంతో నెల రోజుల గ్యాప్ లో మెగా తండ్రీ కొడుకుల సినిమాలు వస్తున్నాయని అభిమానులు ఖుషీ అయ్యారు. అయితే ఇప్పుడు ఈ సినిమాల విడుదల తేదీలు మారే అవకాశం ఉందంటూ గాసిప్స్ వినిపిస్తున్నాయి. శంకర్ దర్శకత్వంలో రామ్ చరణ్ హీరోగా తెరకెక్కుతున్న 'గేమ్ ఛేంజర్' సినిమా చాలా కాలంగా నిర్మాణంలోనే ఉంది. ఎట్టకేలకు షూటింగ్ పూర్తి చేసుకుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. ఈ సినిమాని క్రిస్మస్ సీజన్ లో థియేటర్లలోకి తీసుకొస్తామని నిర్మాత దిల్ రాజు స్వయంగా తెలిపారు. రీసెంట్ గా అక్కినేని నాగార్జున అడిగితే 'బిగ్ బాస్' వేదిక మీద కూడా ఇదే చెప్పారు. దీంతో డిసెంబర్ 20 లేదా డిసెంబర్ 25న రావొచ్చని అందరూ అనుకున్నారు. కానీ ఇప్పుడు ఈ సినిమాకు మరో కొత్త రిలీజ్ డేట్ వినిపిస్తోంది. 'గేమ్ ఛేంజర్' చిత్రాన్ని 2025 సంక్రాంతి బరిలో దించబోతున్నారనే టాక్ సోషల్ మీడియాలో నడుస్తోంది. ఎందుకంటే 'విశ్వంభర' సినిమా పండక్కి రాకపోవడమే అనే మాట గట్టిగా వినిపిస్తోంది. చిరంజీవి చిత్రాన్ని జనవరి 10న విడుదల చేస్తామని షూటింగ్ స్టార్ట్ చేసినప్పుడే ప్రకటించారు. కానీ ఇప్పుడు డిజిటల్ ఒప్పందాల కారణంగా పొంగల్ రేసు నుంచి తప్పుకోనుందని అంటున్నారు. ప్రముఖ ఓటీటీ సంస్థ మంచి రేటుకు డిజిటల్ రైట్స్ కోట్ చేస్తున్నప్పటికీ, జనవరి స్లాట్ ఖాళీ లేకపోవడంతో ఈ సినిమాని సమ్మర్ లో రిలీజ్ చేయాలనే కండిషన్ పెడుతున్నారట. ఈ విషయం మీద మేకర్స్ ఓటీటీ సంస్థతో చర్చలు జరుపుతున్నారట. ఒకవేళ 'విశ్వంభర' సినిమా సంక్రాంతి రేసు నుండి తప్పుకుంటే, అదే తేదీకి 'గేమ్ ఛేంజర్' ను తీసుకోవాలని దిల్ రాజు ఆలోచిస్తున్నారట. ఈ అంశం మీదనే చిరంజీవి, యూవీ నిర్మాతలతో చర్చిస్తారని టాక్ వినిపిస్తోంది. కాకపోతే ఇక్కడ విషయం ఏంటంటే, పొంగల్ కు ప్లాన్ చేసిన వెంకటేశ్ 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాకి దిల్ రాజే నిర్మాత. అలానే సంక్రాంతికి రావాలని అనుకుంటున్న బాలకృష్ణ 'NBK 109' డిస్ట్రిబ్యూటర్ కూడా ఆయనే. కాబట్టి క్లాష్ లేకుండా మూడు సినిమాలకు థియేటర్లు సర్దుబాటు చేసుకునేలా రిలీజ్ డేట్లు ఫిక్స్ చేసుకోవాల్సి ఉంటుంది. 'గేమ్ ఛేంజర్' సినిమా సంక్రాంతికి షిఫ్ట్ అయిపోతే మాత్రం మరికొన్ని చిత్రాల విడుదల తేదీల్లో మార్పులు జరుగుతాయి. క్రిస్మస్ కి కొన్ని మీడియం రేంజ్ చిత్రాలు షెడ్యూల్ చేసే అవకాశం ఉంది. ఏదేమైనా 'విశ్వంభర', 'గేమ్ ఛేంజర్' సినిమాల కొత్త విడుదల తేదీల గురించి దసరా తర్వాత ఒక స్పష్టత వస్తుందని అనుకుంటున్నారు. వచ్చే సంక్రాంతికి రెండిటిలో ఏ సినిమా వచ్చినా మెగా ఫ్యాన్స్ కు పండగే. చూద్దాం ఏం జరుగుతుందో.

# కియారాకి కెరీర్ కి కిక్ ఇస్తుందా..?

బాలీవుడ్ లో మొన్నటిదాకా సూపర్ ఫాం కొనసాగించిన కియరా అద్వాని ఆఫ్టర్ మ్యారేజ్ కాస్త దూకుడు తగ్గించిందని చెప్పొచ్చు. లాస్ట్ ఇయర్ కూడా అమ్మడు కేవలం ఒకే ఒక్క సినిమా చేసింది. ఈ ఇయర్ అయితే ఒక్క సినిమా కూడా రిలీజ్ కాలేదు. గేమ్ చేంజర్ ఈ ఇయర్ వస్తుందని అనుకోగా అది కూడా 2025 సంక్రాంతికి వాయిదా పడింది. ఐతే నెక్స్ట్ మాత్రం కియరా కెరీర్ కి మాంచి కిక్ ఇచ్చే సినిమాలే ఉన్నాయని చెప్పొచ్చు. చరణ్ తో గేమ్ ఛేంజర్ సినిమా చేస్తున్న కియరా మొదటి సారి కలిసి చేసిన సినిమాతో డిజాస్టర్ అందుకున్నా ఈసారి అన్నీ పక్కా కాలిక్యులేషన్స్ తో వస్తున్న సినిమా కాబట్టి భారీ అంచనాలు ఉన్నాయి. శంకర్ డైరెక్షన్ లో తెరకెక్కుతున్న గేమ్ ఛేంజర్ సినిమా విషయంలో కియరా చాలా నమ్మకంగా ఉంది. మరోపక్క అమ్మడు ఈ సినిమాతో పాటు క్రేజీ మల్టీస్టారర్ వార్ 2 లో కూడా నటిస్తుంది. ఎన్టీఆర్ హృతిక్ రోషన్ కలిసి నటిస్తున్న వార్ 2 లో



కియరా లక్కీ ఛాన్స్ అందుకుంది. ఈ సినిమాతో బాలీవుడ్ లోనే కాదు సౌత్ లో కూడా అమ్మడు క్రేజ్ తెచ్చుకోనుంది. ఈ రెండు సినిమాలే కాకుండా కె.జి.ఎఫ్ యష్ చేస్తున్న టాక్సిక్ లో కూడా అమ్మడు ఛాన్స్ అందుకుంది. కియరా రాబోతున్న సినిమాలు చూస్తే ఒకదానికి మించి మరోటి అన్నట్టుగా ఉంది. ఈ సినిమాల్లో ఏది కూడా అసలు తీసి పారేయడానికి లేదు. మూడు సినిమాలు మూడు కూడా భారీ హైప్ తో భారీ టార్గెట్ తో వస్తున్నాయి. అంతేకాదు గేమ్ ఛేంజర్ తో పాటుగా వార్ 2, టాక్సిక్ ఈ రెండు సినిమాలు కూడా నెక్స్ట్ ఇయర్ రిలీజ్ కాబోతున్నాయి. సో నెక్స్ట్ ఇయర్ పాన్ ఇండియా మొత్తం కియరా పేరు మారు మోగిపోతుందని చెప్పొచ్చు. అందం అభినయం రెండితో అదరగొట్టేస్తున్న కియరా రాబోతున్న సినిమాలతో నేషనల్ లెవెల్ లో సత్తా చాటనుందని చెప్పొచ్చు. కచ్చితంగా ఈ సినిమాలు కియరా కెరీర్ కి మాంచి కిక్ ఇచ్చేలా ఉంటాయని ఫిక్స్ అవ్వొచ్చు. పెళ్లి తర్వాత కాస్త కెరీర్ డల్ మూమెంట్ కొనసాగిస్తున్న కియరాకి ఈ మూడు సినిమాలు మళ్లీ ఆమెను స్టార్ లీగ్ లోకి తెస్తాయని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. గేమ్ ఛేంజర్, వార్ 2 సినిమాలతో తెలుగులో కూడా మళ్లీ కియరా క్రేజ్ చాటనుంది. మహేష్ భరత్ అనే నేనుతో తెలుగు తెరకు పరిచయమైన కియరా చరణ్ తో చేసిన వినయ విధేయ రామ ఫ్లాప్ అవ్వడంతో తెలుగు సినిమాలకు బ్రేక్ ఇచ్చింది.

# 8 వసంతాలు.. అందరి ఫోకస్ టీజర్ పైనే..

'తను' మూవీ ఫేమ్ ఫణీంద్ర నర్సెట్టి మరల ఆరేళ్ళ గ్యాప్ తర్వాత '8 వసంతాలు' అనే సినిమాని తెరకెక్కిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఫిమేల్ సెంట్రిక్ కథాంశంతో సిద్ధం అవుతోన్న ఈ చిత్రంలో అనంతిక సునీల్ కుమార్ మెయిన్ లీడ్ రోల్ లో నటిస్తోంది. ఇప్పటికే పోస్టర్స్ తో ఎట్రాక్ట్ చేస్తోన్న ఈ మూవీ క్యారెక్టర్ టీజర్ ని దసరాకి రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ ఎనౌన్స్ చేశారు. ఇదిలా ఉంటే తాజా టీజర్ రిలీజ్ డేట్ కన్ఫర్మ్ చేశారు. అక్టోబర్ 12న సుద్ధి అయోధ్య క్యారెక్టర్ టీజర్ ని రిలీజ్ చేయబోతున్నట్లు ట్విట్టర్ లో మేకర్స్ ప్రకటించారు. అలాగే పోస్టర్ కూడా ట్వీట్ కి జత చేశారు. చుట్టూ కురుస్తున్న మంచులో చీర కట్టుకొని పైన దుప్పటి కప్పుకొని ఉన్న హీరోయిన్ ఫోటోని పోస్టర్ లో చూపించారు. ఈ చిత్రాన్ని ఫీల్ గుడ్ లవ్ డ్రామాగా దర్శకుడు ఫణీంద్ర నర్సెట్టి




తెరకెక్కించినట్లు పోస్టర్స్ చూస్తుంటే అర్థమవుతోంది. అందరూ కొత్తవాళ్లతో మూవీ కథని చెబుతున్నట్లు తెలుస్తోంది. మైత్రీ మూవీ మేకర్స్ ఈ ప్రాజెక్ట్ ని నిర్మిస్తోంది అంటేనే కంటెంట్ లో కచ్చితంగా ఇంటరెస్టింగ్ విషయం ఉంటుందనే అభిప్రాయం పబ్లిక్ లోకి వెళ్ళింది. డైరెక్టర్ ఫణీంద్ర నర్సెట్టి కూడా 'మధురం' అనే ఇండిపెండెంట్ ఫిల్మ్ తో ఒక ప్రేమకథని పొయిటిక్ గా ప్రెజెంట్ చేసి అందరిని ఆకట్టుకున్నాడు. చాందిని చౌదరి లీడ్ రోల్ లో 'తను' అనే సినిమాతో దర్శకుడిగా బిగ్ స్క్రీన్ పై పరిచయం అయ్యాడు. ఈ చిత్రంలో సైకలాజికల్ థ్రిల్లర్ ఎలిమెంట్స్ ని తెరపై చూపించారు. ఇప్పుడు '8 వసంతాలు' చిత్రంలో ఒక అమ్మాయి లైఫ్ జర్నీని ఆవిష్కరించబోతున్నట్లు టాక్ వినిపిస్తోంది. 'హాయ్ నాన్న', 'ఖుషి' సినిమాలకి మ్యూజిక్ డైరెక్టర్ మంచి ఆల్బమ్స్ అందించిన హేసమ్ అబ్దుల్ వాహబ్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. దీనిని బట్టి ఈ సినిమాలో కూడా అద్భుతమైన మెలోడీ సాంగ్స్ ఉండే అవకాశాలున్నాయనే టాక్ వినిపిస్తోంది. సుద్ధి అయోధ్య క్యారెక్టర్ టీజర్ రోజే '8 వసంతాలు' మూవీ రిలీజ్ కూడా ఎనౌన్స్ చేసే అవకాశం ఉందనే ప్రచారం నడుస్తోంది. డిఫరెంట్ కాన్సెప్ట్ తో లవ్ డ్రామాగా రాబోయే ఈ మూవీ ఏ మేరకు ప్రేక్షకులని ఎట్రాక్ట్ చేస్తుందనేది వేచి చూడాలి.



# నరేందర్‌రెడ్డిని ఎందుకలా అరెస్టు చేశారు?

హైదరాబాద్: కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అరెస్టు విధానాన్ని తెలంగాణ హైకోర్టు తప్పుపట్టింది. కేబీఆర్ పార్కు వద్ద వాకింగ్‌కు వెళ్లినప్పుడు ఎందుకు అరెస్టు చేశారని ప్రశ్నించింది. మాజీ ఎమ్మెల్యేను ఓ ఉగ్రవాదిలాగా ఎందుకు అరెస్టు చేయాల్సి వచ్చిందని నిలదీసింది. నరేందర్‌రెడ్డి పరారీలో ఉన్నారా అని పీపీని ప్రశ్నించింది. దాడికి గురైన అధికారుల గాయాలపై సరిగ్గా నివేదించలేదని హైకోర్టు పేర్కొంది. తీవ్రగాయాలైనట్లు రిపోర్టు ఇచ్చి.. చిన్న గాయాలైనట్లు రాశారని చెప్పింది. నరేందర్‌రెడ్డి అరెస్టు విషయంలో సుప్రీంకోర్టు నిబంధనలు పాటించలేదని ఉన్నత న్యాయస్థానం ఆక్షేపించింది. మరోవైపు ప్రజలను రెచ్చగొట్టేలా నరేందర్‌రెడ్డి మాట్లాడారని పీపీ తెలిపారు. ఈ దశలో పిటిషన్‌ను అనుమతిస్తే దర్యాప్తుపై ప్రభావం చూపుతుందన్నారు. రిమాండ్ ఆర్డర్‌ను క్వాష్ చేయాలన్న నరేందర్‌రెడ్డి పిటిషన్‌ను కొట్టివేయాలని కోరారు. రిమాండ్ ఆర్డర్ క్వాష్ పిటిషన్‌పై వాదనలు ముగిశాయి. తీర్పును హైకోర్టు రిజర్వు చేసింది. నరేందర్‌రెడ్డి పాత్రపై నమోదు చేసిన వాంగ్మూలాలు ఇవ్వాలని పీపీని ఆదేశించింది.

# వేములవాడలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన.. పలు అభివృద్ధి పనులకు భూమిపూజ



వేములవాడ: సీఎం రేవంత్‌రెడ్డి వేములవాడలో పర్యటిస్తున్నారు. దీనిలో భాగంగా ఆయన రాజరాజేశ్వరస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు ఆశీర్వచనాలిచ్చి తీర్థప్రసాదాలు అందజేశారు. వేములవాడలో రూ.127.65 కోట్లతో అభివృద్ధి పనులను రాష్ట్ర ప్రభుత్వం చేపడుతోంది. ఈక్రమంలో ఆలయ సమీపంలో పలు అభివృద్ధి పనులకు సీఎం భూమిపూజ చేశారు. అనంతరం గుడి చెరువులో ఏర్పాటు చేసిన సభలో పాల్గొన్నారు. గల్ఫ్ మృతుల కుటుంబాలకు పరిహారం పంపిణీ చేశారు. నేతన్నల కోసం రూ.50 కోట్లతో నూలు బ్యాంకును సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# కేటీఆర్ జైలుకే.. మనసులో మాట బయటపెట్టిన సీఎం రేవంత్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌నుద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్న నేపథ్యంలో వేములవాడలో నిర్వహించిన ప్రజా విజయోత్సవ సభలో ఆయన పాల్గొన్నారు. మిడ్‌మానేరు నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తామని ఈ సందర్భంగా సీఎం హామీ ఇచ్చారు. కొన్నేళ్లుగా వాయిదా పడుతూవస్తున్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. తమ మంత్రులు ఎప్పటికప్పుడు ప్రాజెక్టులపై సమీక్షిస్తారని చెప్పారు. ప్రజలకు మంచి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రేవంత్ రెడ్డి తెలిపారు. అదే సమయంలో కేటీఆర్ లక్ష్యంగా సంచలన వ్యాఖ్యలు చేశారు. అభివృద్ధి ప్రాజెక్టుల కోసం సేకరించే భూమికి రైతులకు రెండు రెట్ల పరిహారం ఇస్తామన్నారు. భూములు తీసుకుని గత బీఆర్ఎస్ ప్రభుత్వంలా పరిహారం ఇవ్వకుండా తప్పించుకోమన్నారు. భూమి మార్కెట్ ధర రూ.10 లక్షలు ఉంటే రూ.30 లక్షల పరిహారం ఇస్తామన్నారు. నష్ట పరిహారం ఎక్కువ ఇస్తే భూయజమానులు తమ భూములు ఇచ్చేందుకు స్వచ్ఛందంగా ముందుకు వస్తారన్నారు. పరిశ్రమలు రావాలంటే భూసేకరణ చేయాల్సిందేనన్నారు. తెలంగాణకు పరిశ్రమలు వద్దని బీఆర్ఎస్ కోరుకుంటుందా అని సీఎం ప్రశ్నించారు. ప్రభుత్వంలో ఉంటూ కుట్రలు చేశారంటూ కేటీఆర్‌పై రేవంత్ మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సక్రమంగా పరిహారం ఇవ్వలేదన్నారు. కుట్రలు చేసిన కేటీఆర్ ఊచలు లెక్కపెడతారంటూ హెచ్చరించారు. కేటీఆర్ చేసిన కుట్రలను గమనిస్తున్నామని రేవంత్ పేర్కొన్నారు. ఎంత ఎగురుతావో ఎగురంటూ చురకలంటించారు. కేటీఆర్ తన వైఖరి మార్చుకోవాలని రేవంత్ పరోక్షంగా సూచించారు.

**కేటీఆర్ VS రేవంత్...** తెలంగాణ రాజకీయం గత కొద్దిరోజులుగా రేవంత్ వర్సెస్ కేటీఆర్‌గా నడుస్తోంది. ఓవైపు గత బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని, అసమర్థ పాలనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కాంగ్రెస్ ఆరోపిస్తుంటే.. అధికారంలోకి వచ్చిన ఏడాదవుతున్నా సీఎం రేవంత్‌కు పాలన చేతకావడంలేదని బీఆర్ఎస్ విమర్శిస్తోంది. రేవంత్ రెడ్డిని బీఆర్ఎస్ టార్గెట్ చేయగా.. కేటీఆర్‌ను కాంగ్రెస్ టార్గెట్ చేస్తోంది. రెండు పార్టీల కంటే ఇద్దరు వ్యక్తుల మధ్య వార్‌గా తెలంగాణ రాజకీయాల్లో గత కొద్దిరోజులుగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో కేటీఆర్ ఊచలు లెక్కపెట్టాల్సి వస్తోందంటూ రేవంత్ చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి.

# గ్రూప్-1 పిటిషన్లపై విచారణ నవంబర్ 26కు వాయిదా



హైదరాబాద్ : గ్రూప్-1 నోటిఫికేషన్‌పై దాఖలైన పిటిషన్లను హైకోర్టు బుధవారం విచారించింది. విచారణ అనంతరం తదుపరి విచారణను నవంబర్ 26వ తేదీకి కోర్టు వాయిదా వేసింది. జీవో-29, ట్రాన్స్‌జెండర్ రిజర్వేషన్లు, లోకల్, నాన్ లోకల్ అంశాలపై దాఖలైన పిటిషన్లను హైకోర్టు డివిజన్ బెంచ్ విచారించింది. కోర్టు తీర్పు వెలువడే వరకు గ్రూప్-1 ఫలితాలు విడుదల చేయొద్దని పిటిషన్ల తరపు అడ్వకేట్స్ డివిజన్ బెంచ్‌ను కోరారు. ఇందుకు జడ్జిలు అంగీకరించారు. అయితే అన్ని కేసులు కలిపి వింటామని జడ్జిలు చెప్పారు. అన్ని పిటిషన్లను అదే వారంలో కంప్లీట్ చేద్దామని జడ్జిలు చెప్పినట్లు సమాచారం. ఈ పిటిషన్లపై కౌంటర్‌లకు ప్రభుత్వ తరపు అడ్వకేట్లు సిద్ధంగా ఉండాలని జడ్జిలు చెప్పారు. వాదనలకు పిటిషనర్ల తరపు అడ్వకేట్ సుధీర్‌కు కూడా అవకాశం ఇస్తామని జడ్జిలు వెల్లడించారు.

# హైదరాబాద్‌లో.. టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి

హైదరాబాద్: హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలో టీడీపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా కృషి చేయాలని ఆ పార్టీ ఫోర్‌మెన్ కమిటీ సభ్యులు నాగు నగేష్ సూచించారు. టీడీపీ సభ్యత్వం నమోదు చేయించాలని కోరారు. దోమలగూడలోని పార్టీ నగర కార్యాలయంలో హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర టీడీపీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.100 చెల్లించి క్రియాశీల సభ్యత్వం తీసుకున్న వారికి రూ.5 లక్షల బీమాను పార్టీ కల్పిస్తుందన్నారు. సమావేశంలో ఫోర్‌మెన్ కమిటీ సభ్యులు ఎండీ.అన్వర్, ఏఎనరావు, సురేందర్, చాంద్రాయణగుట్ట నియోజకవర్గ నాయకులు సబి ఉద్దీన్, రఫీ, రావుల వెంకటరమణ, వెంకటసాయి, సందీప్, యాకుత్‌పుర నియోజకవర్గ నాయకులు ఎండీ.షఫీ, వై.శ్రీకాంత్, చార్మినార్ నాయకులు జోగిందర్‌సింగ్, రెహమాన్, గోషామహల్ నాయకులు ఊర్మిళదేవి, నందకిషోర్, బహదూర్‌పుర నాయకులు ఎంఏ.రెహమాన్, కార్వాన్ నాయకులు సురేందర్‌సింగ్, మలక్‌పేట నాయకులు పాల్గొన్నారు.




# రష్యా గురిలో అమెరికా ఎంబసీ..?

## రష్యా గురిలో అమెరికా ఎంబసీ..? ఆగమేఘాల మీద ఖాళీ చేసిన అగ్రరాజ్యం

ఉక్రెయిన్‌లోని తమ రాయబార కార్యాలయాన్ని తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు అమెరికా పేర్కొంది. కీవ్‌లోని తమ దౌత్య కార్యాలయంపై రష్యా బుధవారం భారీ వైమానిక దాడులకు పాల్పడే అవకాశం ఉందని తమకు సమాచారం వచ్చిందని అమెరికా వెల్లడించింది. ఈనేపథ్యంలోనే ఎంబసీని మూసివేయాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపింది. నవంబర్ 20న దాడి జరగబోతోందని తమకు కచ్చితమైన సమాచారం అందిందని వెల్లడించింది. రాయబార కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించింది. ఎయిర్ అలర్ట్‌లు ప్రకటించగానే కీవ్‌లోని అమెరికా పౌరులు షెల్టర్లలోకి వెళ్లిపోవాలని కోరింది. రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధం ముదురుతున్న విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో రష్యా పైకి దీర్ఘశ్రేణి క్షిపణుల ప్రయోగానికి ఉక్రెయిన్‌కు అమెరికా అనుమతివ్వడంతో అగ్నికి ఆజ్యం పోసినట్లైంది. దీంతో ఆగ్రహించిన రష్యా అధ్యక్షుడు పుతిన్ అణ్వాయుధాల వినియోగానికి అనుమతించే నిబంధనలను మరింత సరళతరం చేసే కీలక దస్త్రంపై సంతకం చేశారు. అణ్వాయుధాలు కలిగిఉన్న దేశం సాయంతో ఏ దేశమైనా తమపై దాడి చేస్తే.. దాన్ని సంయుక్త దాడిగానే పరిగణిస్తామని అందులో పేర్కొన్నారు. మరోవైపు అమెరికా ఇచ్చిన అనుమతితో ఉక్రెయిన్ ఏకంగా ఆరు దీర్ఘశ్రేణి క్షిపణుల్ని(ఆర్మీ టాక్టికల్ మిస్సైల్ సిస్టమ్) రష్యా పైకి ప్రయోగించింది. ఇందులో ఐదింటిని కూల్చేశామని, మరో దాన్ని ధ్వంసం చేశామని రష్యా ప్రకటించింది. దీంతో పొరుగునున్న ఐరోపా దేశాలు అప్రమత్తమయ్యాయి. చిన్న పిల్లల ఆహార పదార్థాలు, ఔషధాలు, తాగునీటిని నిల్వ చేసుకోవాలని కొన్ని నాటో దేశాలు తమ ప్రజలకు సూచించాయి.



# గచ్చిబౌలిలో కొనసాగుతోన్న ఒరిగిన భవనం కూల్చివేత పనులు

హైదరాబాద్: గచ్చిబౌలిలోని సిద్ధిఖీ నగర్‌లో ఒరిగిన నాలుగంతస్తుల భవనం కూల్చివేతను అధికారులు ప్రారంభించారు. హైడ్రాలిక్ యంత్రం సాయంతో పైఅంతస్తు నుంచి కూల్చివేత చేపట్టారు. ఒరిగిన భవనం చుట్టూ స్థానికులను హైడ్రా, జీహెచ్ఎంసీ అధికారులు ఖాళీ చేయించారు. బుధవారం ఉదయానికే యంత్రాన్ని అక్కడికి తీసుకొచ్చి కూల్చివేత చేపట్టారు. సిద్ధిఖీనగర్‌లో కొద్దిపాటి స్థలంలో నిర్మించిన భవనం మంగళవారం రాత్రి ఒకపక్కకు ఒరగడం భయాందోళన సృష్టించింది. మూడు రోజుల క్రితం ఆ భవనం వెనుక ఓ కొత్త భవనం నిర్మాణ పనులు మొదలయ్యాయి. దాని ప్రభావంతో మంగళవారం రాత్రి 8.30 గంటల సమయంలో ఆ భవనం ఒక్కసారిగా గుంతల వైపునకు ఒరిగింది. అందులోని దాదాపు 30 మంది ప్రాణభయంతో బయటకు పరుగు తీశారు. ఈ క్రమంలో మూడో అంతస్తులోని ఇక్బాల్ హుస్సేన్ అనే వ్యక్తి భయంతో పైనుంచి కిందకు దూకడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

**పరిహారం ఇప్పించండి: స్వప్న, భవన యజమాని...** పక్కనే మరో నిర్మాణానికి గుంతలు తవ్వడంతోనే తమ భవనం పక్కకు ఒరిగిందని యజమాని స్వప్న అన్నారు. రెండేళ్ల క్రితం ఇల్లు నిర్మించామని చెప్పారు. మంగళవారం రాత్రి పక్కకి ఒరగడంతో అందులోని అందరం ఖాళీ చేశామని తెలిపారు. "భవనం కూలిపోతే చుట్టుపక్కల వారికి ఇబ్బంది కాబట్టి తొలగిస్తున్నారు. దాన్ని నేను అంగీకరిస్తాను. కానీ.. పక్క భవనం యజమానితో నష్టపరిహారం ఇప్పించండి. ఊరిలో పొలం అమ్మి అప్పు చేసి ఇల్లు కట్టాం. ఇది కోల్పోతే మా పిల్లల భవిష్యత్తేంటి? భవనం కూల్చివేతతో నాతోపాటు పిల్లలు రోడ్డున పడతారు" అని స్వప్న ఆవేదన వ్యక్తం చేశారు.

# 11 నెలల కాలంలో 42 మంది విద్యార్థులు మృతి.. రేవంత్ సర్కార్‌పై మండిపడ్డ హరీశ్‌రావు



హైదరాబాద్ : రేవంత్ పాలనలో గురుకులాలు అస్తవ్యస్తంగా మారాయి. ఫుడ్ పాయిజన్, పాముకాట్లతో విద్యార్థులు ఆస్పత్రుల పాలవుతున్నారు. తాజాగా నల్లగొండ జిల్లా కేతెపల్లి మండల పరిధిలోని బీసీ గురుకులంలో ఓ విద్యార్థి పాముకాటుకు గురయ్యాడు. ఈ ఘటనపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రంగా స్పందించారు. నల్లగొండ జిల్లాలో పాము కాటుకు గురై మరో గురుకుల విద్యార్థి ఆసుపత్రి పాలైన వార్త తీవ్రంగా కలిచివేసింది. కాంగ్రెస్ పాలనలో బడిలో పాఠాలు నేర్చుకోవాల్సిన పిల్లలు ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రుల్లో చేరుతుండడం సిగ్గుచేటు. గురుకులాల్లో కుక్కకాట్లు, ఎలుక కాట్లు, పాము కాట్లు సాధారణంగా మారడం దురదృష్టకరం. విద్యాశాఖ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖలు తన వద్దనే ఉన్నా ముఖ్యమంత్రి ఏనాడు సమీక్ష చేయడని హరీశ్‌రావు మండిపడ్డారు. పురుగులన్నం తినలేక విద్యార్థులు ఆకలితో అలమటించినా పట్టించుకోడు. ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు ఆస్పత్రుల పాలైన పట్టించుకోడు. టీచర్లు కావాలంటూ విద్యార్థులు రోడ్డెక్కినా పట్టించుకోడు.

పాముకాట్లు, కుక్క కాట్లు, ఎలుక కాట్లు, కరెంటు షాకులతో ఆసుపత్రుల పాలైనా పట్టించుకోడు. మీ 11నెలల కాలంలో 42 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటికైనా కళ్ళు తెరవండి అని ఎన్నిసార్లు మొత్తుకున్నా పట్టించుకోడు. రేవంత్ రెడ్డి నిర్లక్ష్యం ఖరీదు 42 మంది విద్యార్థుల ప్రాణాలు. విద్యాశాఖ ప్రక్షాళన అంటూ ప్రగల్భాలు పలకడం కాదు రేవంత్ రెడ్డి.. గురుకులాల్లో కనీస సౌకర్యాలు కల్పించి, విద్యాబోధన జరిగేలా చూడండి. అభం శుభం తెలియని చిన్నారుల ప్రాణాలు కాపాడండి అని హరీశ్‌రావు కోరారు.

# పింక్ బుక్‌లో వారి పేర్లు.. అధికారంలోకి వచ్చాకా..



హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. మంగళవారం వరంగల్ వేదికగా ప్రజా పాలన ప్రజా విజయోత్సవ సభలో బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ పై చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో కారు పార్టీ శ్రేణుల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. అలాంటి వేళ.. ఆ పార్టీ అగ్రనేతలు వరుసగా స్పందిస్తున్నారు. బుధవారం నిజామాబాద్ లో మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఏ జీవన్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భాష మార్చుకోవాలని హితవు పలికారు. వరంగల్ సభలో సీఎం రేవంత్.. రైతుల విషయంలో మాట్లాడినవన్నీ పచ్చి అబద్ధాలు అని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ అనవాళ్లు లేకుండా చేయటం ఎవరికి సాధ్యం కాదని ఆయన స్పష్టం చేశారు. కేసీఆర్, కేటీఆర్ లను టచ్ చేస్తే తెలంగాణ రాష్టం అగ్గిపాలవుతుందని హెచ్చరించారు.

సీఎం రేవంత్ రెడ్డి ముందు తన గ్రామంలోని సంగతి చూసుకుంటే చాలని వ్యంగ్యంగా అన్నారు. ఈ కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం పదేళ్లు వెనక్కి వెళ్లిందని విమర్శించారు. మరో మూడు నెలల్లో కాంగ్రెస్ నేతలు బయట తిరగ లేరన్నారు. తెలంగాణను ఆంధ్రలో కలిపేందుకు సీఎం రేవంత్ కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రజలకు రక్షణ లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అధికార కాంగ్రెస్ పార్టీకి వత్తాసు పలికిన పోలీసుల జాతకాలు పింక్ డైరీలో నోట్ చేస్తున్నామన్నారు. అధికారంలోకి వచ్చిన అనంతరం వారి సంగతి చూస్తామని హెచ్చరించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇక తెలంగాణ భవన్ లో మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను తిట్టి పోయడం రేవంత్ రెడ్డికి సంబరమా? అని ప్రశ్నించారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ ను ఎదుర్కొనే ధైర్యం ఈ ప్రభుత్వానికి ఉందా? అని ఆయన సందేహం వ్యక్తం చేశారు. అయితే వేదిక ఏదైనా సీఎం రేవంత్ రెడ్డి తీరు మాత్రం మారటం లేదని.. చివరకు అసెంబ్లీ సమావేశాల్లో సైతం ఆయన ఇలాగే మాట్లాడితే ఎలా అని ప్రశ్నించారు. కేసీఆర్ నిర్మించిన ప్రాజెక్టుల వల్లే భూగర్భ జలాలు పెరిగాయని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఆ క్రమంలోనే పంట దిగుబడి సైతం పెరిగిందని పొన్నాల లక్ష్మయ్య అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మీద రేవంత్ కు అసలు అవగాహన ఉందా? అంటూ సందేహం వ్యక్తం చేశారు. తెలంగాణ ఆర్థిక పరిస్థితిపై తనతో చర్చకు రావాలని సీఎం రేవంత్ కు ఈ సందర్భంగా ఆయన సవాల్ విసిరారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మొక్క కాదు.. మహావృక్షం అని అభివర్ణించారు. ఆయన్ని అంతం చేయడం సీఎం రేవంత్ వల్ల అవుతుందా? అని మండిపడ్డారు. రేవంత్ లాంటి వాళ్ళు ఎంతో మంది వస్తారు.. పోతారు. బీఆర్ఎస్ మాత్రం అలానే ఉంటుందన్నారు. వరంగల్ లో కాళోజీ కళా క్షేత్రం కేసీఆర్ ప్రభుత్వ హయంలోనే నిర్మాణం అయిందన్నారు. ఆ క్రెడిట్ తీసుకోవడానికి సీఎం రేవంత్ రెడ్డికి సిగ్గుండాలంటూ చరకలంటించారు. అయితే కేసీఆర్ మొక్క కాదు.. కానీ రేవంతే మొక్క అని ఆయన స్పష్టం చేశారు. అలాంటి మొక్కను వేళ్ళతో పీకేసే రోజు త్వరలోనే వస్తుందని ఆయన ఆశాభవం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ హై కమాండ్ నియమిస్తే వద్దన్నామా? తీసేస్తే కూడా వద్దనమని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య స్పష్టం చేశారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com